teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 04 | సంచిక : 158 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | గురువారం | 4 డిసెంబర్ 2025 | పేజీలు : 08 | వెల ₹5

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.

## టీ20 ప్రపంచకప్‌కు భారత్ కొత్త జెర్సీ

బ్లూ-ఆరెంజ్ కాంబినేషన్ ఆవిష్కరణ

వచ్చే ఏడాది భారత్, శ్రీలంకలలో పొట్టి ప్రపంచకప్



07

## కడుపునిండా మంచి భోజనం పెట్టండి

ఓయూ మెస్‌లో పాడైన భోజనం.. హరీశ్‌రావు ఫైర్

హామీలైతే 1000 కోట్లు.. మంచి భోజనానికే దిక్కులేదు

### తెలంగాణ విద్యావ్యవస్థపై ఆగ్రహం



తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 03 (తీన్మార్ న్యూస్): మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ) లా కాలేజీ మెస్‌లో విద్యార్థులకు పాడైపోయిన అన్నం పెడుతున్న ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. విద్యార్థులు రోడ్డుపైకి వచ్చి ఆందోళన

మిగతా 2 లో

## హెచ్ఎండీఏకు కాసులపంట

- కోకాపేట భూమి ఎకరం రూ. 131 కోట్లు
- ముగిసిన మూడో విడత వేలం
- 8.04 ఎకరాలకు సుమారు వెయ్యి కోట్ల ఆదాయం
- మొత్తంగా 27 ఎకరాలకు రూ. 3,708 కోట్ల ఆదాయం







# పంచాయతీ ఎన్నికల వేళ ప్రచార జోరు


## స్పీడ్ పెంచిన సర్పంచ్ అభ్యర్థులు

పార్టీలకు అతీతంగా

ఓటర్ల మెప్పు కోసం పాట్లు

తొలి విడత అభ్యర్థులకు

గుర్తుల కేటాయింపు



రాష్ట్రంలో సర్పంచ్ ఎన్నికల జోరు పెరిగింది. రాష్ట్రంలో మూడు విడతలుగా జరగనున్న పంచాయితీ ఎన్నికల్లో ఇప్పటికే రెండు దశల నామినేషన్ల ప్రక్రియ పూర్తయ్యి, ఎన్నికలకు సిద్ధం అవుతుండగా 11న జరిగే తొలి దశ ఎన్నికల అభ్యర్థుల గుర్తులు కేటాయించింది ఎన్నికల సంఘం.



## రైతులకంటే పారిశ్రామికవేత్తలే ముఖ్యమా?

హిల్ట్ పాలసీపై కిషన్ రెడ్డి ధ్వజం

హైదరాబాద్‌ను మరో బెంగళూరు చేస్తారా?

రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాల్సిందే

.. వివరాలు 2లో

SANCHAR SAATHI

## ప్రైవసీ వివాదంపై వెనక్కి తగ్గిన కేంద్రం

సంచార్ సాథీ యాప్ తప్పనిసరి కాదు

యూజర్లు ఎప్పుడైనా డిలీట్ చేసుకోవచ్చని కేంద్రం వివరణ

.. వివరాలు 2లో



## ప్రధాని మోడీతో సీఎం రేవంత్ భేటీ

గ్లోబల్ సమ్మిట్ కు రావాలని ఆహ్వానం

బుల్లెట్ ట్రైన్, ఆర్ఆర్ఆర్‌కు అనుమతివ్వాలని విజ్ఞప్తి

తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 03 (తీన్మార్ న్యూస్): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రధాని నరేంద్ర మోడీతో భేటీ అయ్యారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం బుధవారం ఉదయం డిప్యూటీ సీఎం భట్టి

మిగతా 2 లో

## దేశవ్యాప్త విమానాశ్రయాల్లో సాంకేతిక సమస్య

మైక్రోసాఫ్ట్ విండోస్‌లో లోపంతో ప్రయాణికులకు తీవ్ర ఇక్కట్లు

శంషాబాద్ విమానాశ్రయంలో 33 ఫ్లైట్స్ రద్దు

సిబ్బందితో వాగ్వాదానికి దిగిన ప్రయాణికులు




తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 03 (తీన్మార్ న్యూస్): దేశ వ్యాప్తంగా విమానాశ్రయాల్లో సాంకేతిక సమస్య తలెత్తింది. మైక్రోసాఫ్ట్ విండోస్‌లో ఏర్పడిన సమస్య కారణంగా ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ సహా దేశ వ్యాప్తంగా విమానాశ్రయాల్లో చెక్‌ఇన్‌లో సమస్యలు తలెత్తాయి. మంగళవారం సాయంత్రం నుంచే ఈ సమస్య తలెత్తగా బుధవారం కూడా కొనసాగింది. దీంతో ప్రయాణికులు తీవ్ర

మిగతా 2 లో



## హిల్ట్ పాలసీ లీకుపై సర్కారు సీరియస్

నవంబర్ 20న ఫోటోషాప్ స్లైడ్స్ లీకైనట్లు అనుమానం

మరుసటి రోజే కేటీఆర్ ప్రెస్‌మీట్

విజిలెన్స్ విచారణకు ప్రభుత్వం ఆదేశం

02

## సర్పంచ్‌ల ఎన్నికలో ఏకగ్రీవానికి సీఎం పిలుపు

హుస్నాబాద్ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన

రూ. 262.78 కోట్లతో జరగనున్న అభివృద్ధి పనులు



హుస్నాబాద్, డిసెంబర్ 03 (తీన్మార్ న్యూస్): 262.78 కోట్లతో హుస్నాబాద్‌లో పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. 2001లో ఈ ప్రాంతం నుంచే తెలంగాణ ఉద్యమం ప్రారంభమైందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హుస్నాబాద్ ప్రజల అభిమానం మరవలేనన్నారు. "మీ ఓటుతో

మిగతా 2 లో

## బాల్య వివాహరహిత భారతదేశం కోసం 100 రోజుల ప్రచారం

ప్రారంభించనున్న కేంద్ర మంత్రి అన్నపూర్ణ దేవి



న్యూ ఢిల్లీ, డిసెంబర్ 03 (తీన్మార్ న్యూస్): బాల్ వివాహ ముక్త్ భారత్ ప్రచారానికి ఏడాది పూర్తయిన

మిగతా 2 లో

## ఫార్ములా ఈ-రేసు అవకతవకల కేసులో కీలక పరిణామం

ఐఏఎస్ అధికారిపై చార్జ్‌షీట్‌కు రంగం సిద్ధం

విచారించేందుకు అనుమతికి

రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ

07



## త్వరలో భూములన్నింటికీ భూధార్ నంబర్లు


- సర్వే, రిజిస్ట్రేషన్, రికార్డుల ఏకీకరణ
- ఎన్ఐసీ పర్యవేక్షణలో కొత్త వెబ్‌సైట్
- నక్షాలు లేని గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టు
- మూడు దశల్లో భూధార్ కార్డుల జారీ

.. వివరాలు 2లో





# పంచాయితీ ఎన్నికల వేళ ప్రచారంలో జోరు




తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 03 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో సర్పంచ్ ఎన్నికల జోరు పెరిగింది. రాష్ట్రంలో మూడు విడతలుగా జరగనున్న పంచాయితీ ఎన్నికల్లో ఇప్పటికే రెండు దశల నామినేషన్ల ప్రక్రియ పూర్తయ్యి, ఎన్నికలకు సిద్ధం అవుతుండగా 11న జరిగే తొలి దశ ఎన్నికల అభ్యర్థుల గుర్తులు కేటాయించింది ఎన్నికల సంఘం. తొలి విడత ఎన్నికల పోలింగ్ కు మరో వారమే మిగిలి ఉండగా ఇప్పటికే అభ్యర్థుల ప్రచారం స్పీడందుకుంది. ఇక రాష్ట్ర ఎన్నికల సంఘం గుర్తులు కూడా కేటాయించడంతో అభ్యర్థులు వారి గుర్తులను గుర్తుంచుకొని ఓటు వేయాలని ఓటర్లను కోరేందుకు సిద్ధం అవుతున్నారు. పార్టీలకు అతీతంగా అభ్యర్థుల స్వభావాన్ని బట్టి లెక్క తేలనున్న పంచాయితీ ఎన్నికలలో ఒక్క ఛాన్స్ ఇస్తే గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపిస్తామని ఓటరు దేవుళ్లను కోరుతున్నారు. ఇక మూడవ దశ ఎన్నికలకు బుధవారం నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. మొదటి దశ, ఈనెల 11న, రెండవ దశ 14న, మూడవ దశ పోలింగ్ ఈనెల 17న జరగనుంది.

## దేశవ్యాప్త విమానాశ్రయాల్లో సాంకేతిక సమస్య

మొదటి పేజీ తరువాయి

ఇబ్బందులు పడుతున్నారు. హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయంలో సమస్య కారణంగా మంగళవారం రాత్రి నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు 33 ఫ్లైట్స్ రద్దు అయినట్లు అధికారుల సమాచారం. ఈ నేపథ్యంలోనే ప్రయాణికులకు ఇబ్బందులు పడ్డారు.. దీంతో సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. వారికి సమాధానం చెప్పలేక సిబ్బంది తంటాలు పడుతున్నారు. ఈ క్రమంలోనే హైదరాబాద్ నుంచి వెళ్లాల్సిన పలు విమానాలు రద్దు అయ్యాయి. డిసెంబర్ 2న హైదరాబాద్ నుంచి వెళ్లాల్సిన 9 ఫ్లైట్స్, ఇతర ప్రాంతాల నుంచి రావాల్సిన 5 ఫ్లైట్స్ రద్దు అయ్యాయి. డిసెంబర్ 3న హైదరాబాద్ నుంచి వెళ్లాల్సిన 7 ఫ్లైట్స్, ఇతర ప్రాంతాల నుంచి రావాల్సిన 12 ఫ్లైట్స్ రద్దు అయ్యాయని అధికారుల సమాచారం. సమస్య కారణంగా శంషాబాద్ విమానాశ్రయంలో శబరిమలకు వెళ్లాల్సిన అయ్యప్ప భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శంషాబాద్ నుంచి ఢిల్లీ, బెంగళూరు, కోల్‌కతా, గోవా, భువనేశ్వర్ వెళ్లాల్సిన కొన్ని విమానాలు రద్దయ్యాయి. మంగళవారం రాత్రి నుంచి ప్రయాణికులు ఎయిర్‌పోర్టులో పడిగాపులు కాస్తున్నారు. విమానం ఎప్పుడు వస్తుందో సిబ్బంది చెప్పడం లేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## హిల్ట్' పాలసీ లీకుపై సర్కారు సీరియస్

హైదరాబాద్, డిసెంబర్ 03 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీకి సంబంధించిన విధాన నిర్ణయం జీవో విడుదల కాకముందే దీనికి సంబంధించిన సమాచారం ప్రతిపక్షాలకు లీక్ కావడంపై ప్రభుత్వం సీరియస్ అయింది. పాలసీని తీసుకురావాలని కసరత్తు చేస్తున్న దశలోనే సమాచారం లీకై ప్రతిపక్షాలకు చేరడంపై దృష్టి సారించింది. ఈ లీకుల వ్యవహారంలో నిగ్గు తేల్చేందుకు తాజాగా ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. నవంబర్ 20 న ఫోటోషాప్ స్లైడ్స్ బయటకు వచ్చినట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆ మరుసటి రోజు నవంబర్ 21న హిల్ట్ పాలసీపై ప్రతిపక్ష నేత కేటీఆర్ ప్రెస్‌మీట్ పెట్టిన ప్రభుత్వ పాలసీపై విమర్శలు గుప్పించారు. అయితే నవంబర్ 22న ప్రభుత్వం జీవో విడుదల చేయగా అంతకు ముందురోజే కేటీఆర్ ఈ అంశాన్ని ప్రస్తావించడం వెనుక సమాచార లీకుల వ్యవహారం ఉందనే అనుమానాలు వ్యక్తం అయ్యాయి. ఈ క్రమంలో ఇప్పటికే శాఖాపరమైన విచారణకు ఆదేశించిన అధికారులు తాజాగా విజిలెన్స్ విచారణకు ఆదేశించారు.

## సర్పంచ్‌ల ఎన్నికలో ఏకగ్రీవానికి సీఎం పిలుపు

మొదటి పేజీ తరువాయి



దుర్మార్గపు పాలనకు చరమగీతం పాడి, కాంగ్రెస్ ప్రజాపాలనను తీసుకొచ్చిన రోజు డిసెంబర్ 3. మొదటి ఏడాదిలోనే 60 వేల ఉద్యోగాల ఖాళీలను భర్తీ చేశాం. మరో 40 వేల ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం యోచిస్తోంది" అని రేవంత్ చెప్పారు. బీఆర్ఎస్ లక్ష కోట్లతో కాళేశ్వరం కడితే అది కూలేశ్వరమైపోయింది. కాంగ్రెస్ హయాంలో కట్టిన ఎస్సారెస్పీ ఎలా ఉంది. బీఆర్ఎస్ కట్టిన కాళేశ్వరం ఎలా ఉందో మీరే ఆలోచించండి. దేశంలో భాక్రానంగల్ నుంచి నాగార్జునసాగర్ వరకూ కాంగ్రెస్ హయాంలో కట్టిన ప్రాజెక్టులే ఇవాళ వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నాయి. ఇవాళ తెలంగాణా వరి దిగుబడుల్లో నంబర్ వన్ స్టేట్‌గా నిల్చింది. కేసీఆర్ హయాంలో రేషన్ కార్డు కావాలంటే దొర గడీ ముందు చేతులు కట్టి నిల్చోవాల్సిన పరిస్థితి. ఆనాడు దొడ్డుబియ్యం ఇస్తే, మనం ఈరోజు 3 కోట్ల 10 లక్షల మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం. మీ పక్కన్నే గజ్వేల్, మరోవైపు సిద్ధిపేట, ఇంకోవైపు సిరిసిల్ల ఉన్నాయి. వాటిని దేవుళ్లేమైనా పాలిస్తున్నారా?. ఆ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయిగానీ, ఇక్కడి గౌరవెల్లి ఎందుకు పూర్తి చేయలేదో మీరు ఆలోచించాలి. ఇక్కడ ఓ ఆదర్శ గ్రామం అని చెప్పి చిన్నముల్కనూరును నాడు కేసీఆర్ ఏం చేశాడో మీకు తెలుసు. మేం వాళ్లలా హుస్నాబాద్‌ను నిర్లక్ష్యం చేయం, అభివృద్ధి చేసి చూపిస్తాం. అందుకే మంత్రి పొన్నం నా ముందు పెట్టిన అన్ని విజ్ఞప్తులకూ నిధులందిస్తామని హామీ. ఆ సర్కార్ లో ఎవ్వరికీ పదేళ్లల్లో డబుల్ బెడ్రూమ్ ఇళ్లు రాలేదు. కానీ, మేం ఇందిరమ్మ ఇళ్లు కట్టి చూపిస్తాం. ఇవాళ మంచి ప్రభుత్వముంటే అభివృద్ధి, సంక్షేమం ఎలా ముందుకెళ్తాయో, గ్రామాల్లో కూడా మంచి సర్పంచ్‌ను ఎన్నుకుంటేనే మీ గ్రామాల అభివృద్ధి జరుగుతుంది. కాబట్టి మంచివాళ్లను సర్పంచులుగా ఎన్నుకోండి. వీలైనంతగా ఏకగ్రీవం చేసుకునే యత్నం చేయాలని పిలుపునిచ్చిన సీఎం రేవంత్. సర్పంచులు కిరికిరిగాళ్లు వస్తే గ్రామాలు తిరోగమనం పడతాయంటూ వ్యాఖ్యానించారు.

## రైతులకంటే పారిశ్రామికవేత్తలే ముఖ్యమా?



హైదరాబాద్, డిసెంబర్ 03 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో రైతులకు ఒక న్యాయం, పారిశ్రామిక వేత్తలకు మరొక న్యాయమా? ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు సహకారం అందించకుండా పారిశ్రామికవేత్తలకు లబ్ధి చేకూరుస్తోందని కిషన్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన హిల్ట్ పాలసీ కోసం వేసిన కమిటీ సచివాలయంలో ఉండి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిందని ఆరోపించారు. హిల్ట్ పాలసీని ఆదరాబాదరగా తీసుకురావడం వెనుక బడా వ్యాపారులకు లబ్ధి చేకూర్చే ప్రయత్నం ఉందని ఆరోపించారు. పారిశ్రామికవాడలో పని చేస్తున్న వారితో చర్చించి నిర్ణయాలు తీసుకోవాలేదన్నారు. అక్కడ పని చేస్తున్న లక్షలాది మంది కార్మికుల భవిష్యత్ ఏమిటో ప్రభుత్వం ఆలోచించిందా అని నిలదీశారు.

**మరో బెంగళూరు చేద్దామనుకుంటున్నారా?:**

హైదరాబాద్ నగరంలో ఇప్పటికే అనేక మౌలిక సమస్యలు ఉన్నాయని ఇప్పుడు హిల్ట్ పేరుతో నగరంలో 9 వేల ఎకరాల్లో మల్టీపర్పస్ కమర్షియల్ కాంప్లెక్సులు నిర్మిస్తే జరగబోయే పరిణామాలను సీఎం అంచనా వేశారా అని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. హైదరాబాద్ ను మరో బెంగళూరుగా మార్చాలని చూస్తున్నారా అని నిలదీశారు. బెంగళూరులో ట్రాఫిక్ సమస్య కారణంగా పెట్టుబడులు వెనక్కి పోయాయని, ఇండస్ట్రీలు తరలిపోతున్నాయని హైదరాబాద్ ను కూడా ఇదే పరిస్థితిలోకి తీసుకురావాలనుకుంటున్నారా అని ప్రశ్నించారు. ఎక్స్ పర్ట్స్ తో చేయాల్సిన పనులను ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటోందని మన దురదృష్టం కొద్దీ గత పదేళ్లు ఈ రాష్ట్రంలో ఏకైక మేధావిని అంటూ కేసీఆర్ సొంత నిర్ణయాలు తీసుకుంటే ఇప్పుడు మరొక మేధావి రేవంత్ రెడ్డి వచ్చారని ఎద్దేవా చేశారు.

**రేవంత్ రెడ్డి బేషరతుగా క్షమాపణలు చెప్పాలి:**

కాంగ్రెస్ పార్టీ హిందువులను హిందూ దేవుళ్లను అవమానించే కార్యచారణగా పెట్టుకున్నట్లుందని కిషన్ రెడ్డి విమర్శించారు. హిందూ దేవుళ్లను అవమానించే విధంగా సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తాను ఖండిస్తున్నానన్నారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు హిందువుల మనోభావాలను కించపరిచేలా ఉన్నాయని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వ్యాఖ్యలపై వెంటనే బేషరతుగా యావత్ హిందు సమాజానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో కేసీఆర్ హిందుగాళ్లు బొందుగాళ్లు అంటూ వెటకారంగా మాట్లాడితే ప్రజలు ఏ రకంగా తీర్పు ఇచ్చారో గుర్తు చేసుకోవాలన్నారు.

## ప్రధాని మోడీతో సీఎం రేవంత్ భేటీ

మొదటి పేజీ తరువాయి

విక్రమార్కతోపాటు ప్రధానిని కలిశారు. ప్రస్తుతం పార్లమెంట్ శీతాకాల సమావేశాలు కొనసాగుతున్నందున పార్లమెంట్ భవనంలోనే ప్రధానితో రేవంత్ రెడ్డి భేటీ అయి ఈనెల 8, 9వ తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు రావాల్సిందిగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సమ్మిట్ గురించి రేవంత్ ప్రధానికి వివరించారు. దాదాపు అరగంట పాటు జరిగిన భేటీలో రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ మెట్రోరైలు రెండో దశ విస్తరణకు అనుమతి, రీజనల్ రింగ్ రోడ్డు దక్షిణ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వాలని కోరారు. అలాగే హైదరాబాద్- బెంగళూరు-చెన్నై బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టుపై విన్నవించారు.

**రాహుల్, ఖర్గేకు ఆహ్వానం**

ప్రధానితో భేటీకి ముందు కేంద్ర ఐటీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను ముఖ్యమంత్రి కలిసి గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా సమ్మిట్‌లో ఆవిష్కరించనున్న విజన్ డాక్యుమెంట్ గురించి ఆయనకు వివరించారు. ప్రధానితో భేటీ అనంతరం కేంద్రమంత్రులు రాజ్ నాథ్ సింగ్, నిర్మాలా సీతారామన్‌తో సీఎం భేటీ అయి సమ్మిట్‌కు రావాలని కోరారు. ఈ భేటీలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎంపీలు డాక్టర్ మల్లు రవి, కుందూరు రఘువీర్‌రెడ్డి, సురేశ్ షెట్కార్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ కడియం కావ్య, గడ్డం వంశీకృష్ణ, అనిల్‌కుమార్ యాదవ్ ఉన్నారు. అలాగే ఏఐసీసీ చీఫ్ ఖర్గేతోపాటు లోకసభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు, ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ, జనరల్ సెక్రటరీ ప్రియాంక గాంధీని సీఎం రేవంత్‌రెడ్డి కలిశారు. బుధవారం ఉదయం పార్లమెంట్ భవనంలోనే వీరితో భేటీ అయి గ్లోబల్ సమ్మిట్‌కు రావాల్సిందిగా ఆహ్వానించారు.

## ఫార్ములా ఈ-రేసు అవకతవకల కేసులో కీలక పరిణామం

హైదరాబాద్, డిసెంబర్ 03 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో సంచలనం సృష్టిస్తున్న ఫార్ములా ఈ-రేసు ఆర్థిక అవకతవకల కేసుకు సంబంధించి మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌ను విచారించేందుకు అనుమతి ఇవ్వాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ రావు బుధవారం కేంద్ర ప్రభుత్వ సిబ్బంది, శిక్షణా శాఖకి లేఖ రాశారు. అక్కడి నుంచి అనుమతి రాగానే ఏసీబీ ఆయనపై చార్జ్‌షీటు దాఖలు చేసేందుకు రంగం సిద్ధం చేస్తోంది. 2023లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఫార్ములా ఈ-కార్ రేసు నిర్వహణకు సంబంధించి నిబంధనలకు విరుద్ధంగా రూ.55 కోట్ల నిధులు విదేశీ సంస్థకు విడుదల చేయడంపై అవినీతి నిరోధక శాఖ కేసు నమోదు చేసింది. కాగా, ఇదే కేసులో A1గా మాజీ మంత్రి కేటీఆర్, A2గా సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, A3గా హెచ్‌ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్‌ఎన్ రెడ్డిగా ఉన్నారు. అయితే, గతంలో హెచ్‌ఎండీఏ కమిషనర్‌గా పనిచేసిన అరవింద్ కుమార్ కేబినెట్, ఆర్థిక శాఖ అనుమతులు లేకుండా, ఎన్నికల కోడ్ అమలుల్లో ఉండగా నిధులను మళ్ళించడంలో కీలక పాత్ర పోషించారని ఏసీబీ ఆరోపిస్తోంది. దేశంలో ఐఏఎస్ అధికారులపై కేసు విచారణ, అభియోగాలు నమోదు చేసేందుకు ముందుగా కేంద్రంలోని డాప్ట్ (డీఓపీటీ) నుంచి ప్రాసిక్యూషన్ అనుమతి తప్పనిసరి కావడంతో సీఎస్ రామకృష్ణా రావు తాజాగా లేఖ రాయడం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది.

## కడుపునిండా మంచి భోజనం పెట్టండి..

మొదటి పేజీ తరువాయి

చేయడాన్ని ఆయన కాంగ్రెస్ పాలనలో విద్యావ్యవస్థ దుస్థితికి అద్దం పడుతోందని అభివర్ణించారు.

సీఎంపై తీవ్ర విమర్శలు

ఉస్మానియా యూనివర్సిటీకి రూ. 1000 కోట్లు ఇస్తానని ప్రగల్భాలు పలికిన ముఖ్యమంత్రి, కనీసం విద్యార్థులకు ఒక పూట మంచి భోజనం పెట్టలేకపోవడం సిగ్గుచేటని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

**నాణ్యతపై ప్రశ్నలు:**

ప్రభుత్వ బడుల్లో మధ్యాహ్న భోజనంలో గొడ్డుకారం, గురుకులాల్లో పురుగుల అన్నం, ఇప్పుడు యూనివర్సిటీల్లో పాడైపోయిన భోజనం %-% ఇదేనా కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో సాధించిన ఘనత అని ఆయన ప్రశ్నించారు.

**నిర్లక్ష్యంపై ఆరోపణ:**

అడుగడుగునా యూనివర్సిటీల పర్యవేక్షణలో ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తున్నదని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రిగా పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు.

**"మింగడానికి మెతుకు లేదు, మీసాలకు సంపంగి నూనె"**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీరు "మింగడానికి మెతుకు లేదు కానీ.. మీసాలకు సంపంగి నూనె" అన్నట్టుగా ఉందని, ఇది ఆయన చేతగానితనానికి నిదర్శనమని హరీశ్‌రావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌రెడ్డి.. ఇప్పటికైనా ప్రగల్భాలు మాని.. విద్యార్థులకు కడుపునిండా మంచి భోజనం పెట్టాలని హరీశ్‌రావు సూచించారు. "మీ చేతగానితనంతో విద్యార్థుల భవిష్యత్తును, ఆరోగ్యాన్ని ఆగం చేయకండి అని ఆయన హితవుపలికారు.

## హెచ్‌ఎండీఏకు కాసులపంట

హైదరాబాద్, డిసెంబర్ 03 (తీన్మార్ న్యూస్): కోకాపేట నియో పోలీస్ భూములకు మూడో విడత వేలం ముగిసింది. బుధవారం ప్లాట్ నంబర్స్ 19, 20లోని 8.04 ఎకరాలకు ఈ వేలం వేశారు అధికారులు. అయితే, ప్లాట్ నెంబర్ 19లో ఎకరానికి 131 కోట్ల ధర పలికింది. ప్లాట్ నెంబర్ 20లో ఎకరానికి 118 కోట్ల రూపాయలకు అమ్ముడు పోయింది. కాగా, బుధవారం 8.04 ఎకరాలకు గాను సుమారు వెయ్యి కోట్ల రూపాయలను హెచ్‌ఎండీఏ పొందింది. ఇక, మూడు విడతల్లో ఆరు ప్లాట్లలోని 27 ఎకరాలకు 3,708 కోట్ల రూపాయలను హెచ్‌ఎండీఏ ఆర్జించింది. అయితే, ఈసారి మొత్తం 44 ఎకరాల భూమిని నాలుగు విడతల్లో హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్మెంట్ అథారిటీ ఈ వేలం వేసింది. కోకాపేటలోని 29 ఎకరాలు, మూసాపేటలోని 15 ఎకరాల భూమికి వేలం వేస్తున్నారు. కోకాపేట గోల్డెన్ మైల్ లోని 2 ఎకరాలు, మూసాపేటలోని 15 ఎకరాలకు డిసెంబర్ 5వ తేదీన ఈ వేలం వేయనున్నారు. అయితే, హెచ్‌ఎండీఏ భూముల వేలంలో కాసుల పంట పండింది. ప్లాట్ నెంబర్ 19ను ఎకరాకు 131 కోట్ల రూపాయల విలువతో యుల కన్స్ట్రక్షన్స్ ఎల్‌ఎల్పీ, గ్లోబస్ ఇన్ఫ్రాకాన్ ఎల్‌ఎల్పీ సంస్థలు పొందాయి. అలాగే, ప్లాట్ నెంబర్ 20లో ఎకరాకు 118 కోట్ల రూపాయలకు బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ దక్కించుకుంది. కాగా, నియో పోలీస్ ఈ-ఆక్షన్‌లో సుమారు 3,700 కోట్ల రూపాయల మైలురాయిని దాటి, సగటు స్థల విలువల్లో అసాధారణ వృద్ధి సాధించింది. మూడు దఫాలుగా నిర్వహించిన ఆక్షన్‌ల ద్వారా ఇప్పటి వరకు కలిపి మొత్తం 3, 708 కోట్ల ఆదాయాన్ని హెచ్‌ఎండీఏ ఆర్జించింది.

## ప్రైవసీ వివాదంపై వెనక్కి తగ్గిన కేంద్రం

న్యూ ఢిల్లీ, డిసెంబర్ 03 (తీన్మార్ న్యూస్): 'సంచార్ సాథీ యాప్'పై కేంద్రం వెనక్కి తగ్గింది. మొబైల్ ఫోన్లలో సంచార్ సాథీ యాప్ ఇన్‌స్టాలేషన్ తప్పనిసరి కాదంటూ అధికారిక ప్రకటన విడుదల చేసింది. కాగా భారత్‌లో విక్రయించే అన్ని కొత్త మొబైల్ ఫోన్‌లలో సంచార్ సాథీ యాప్‌ను తప్పనిసరిగా ప్రీ-ఇన్‌స్టాల్ చేయాలని, దాని ఫంక్షన్‌లను ఎవరూ డిసేబుల్ చేయకూడదని కేంద్ర టెలికాం శాఖ ఆదేశాలు జారీ చేసింది. అయితే కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం ప్రజల ప్రైవసీ ఉల్లంఘన అంటూ విపక్షాలు తీవ్ర అభ్యంతరం తెలిపాయి. అంతేకాదు పెగాసస్ లాంటి స్నూపింగ్ టూల్, బిగ్ బ్రదర్ వాచ్( ప్రజలపై నిఘా) అంటూ ఇటు విపక్షాలు, అటు యాక్టివిస్టుల నుంచి తీవ్ర విమర్శలు చేయడంతో కేంద్రం దిద్దుబాటు చర్యలకు దిగి యాప్ ఇన్‌స్టాలేషన్ తప్పనిసరి కాదని వివరణ ఇచ్చింది. మొబైల్ యూజర్లు 'సంచార్ సాథీ యాప్' ను ఎప్పుడైనా డిలీట్ చేసుకోవచ్చని, రిజిస్టర్ చేయకపోతే అది పూర్తిగా ఇనాక్టివేట్ గానే ఉంటుందని స్పష్టం చేస్తూ కేంద్ర ప్రభుత్వం బుధవారం అధికారిక ప్రకటన జారీ చేసింది. దీంతో కొత్త ఫోన్లలో ఇంబిల్ట్ గా సంచారీ సాథీ యాప్ ఉన్నప్పటికీ, మొబైల్ కొనుగోలు చేశాక యూజర్ దానిని తొలగించుకునే పూర్తి స్వేచ్ఛ ఉంది.

## బాల్య వివాహరహిత "భారతదేశం కోసం 100 రోజుల ప్రచారం"

మొదటి పేజీ తరువాయి

సందర్భంగా, బాల్య వివాహ రహిత భారత్ కోసం 100 రోజుల అవగాహన ప్రచారాన్ని మహిళా మరియు శిశు అభివృద్ధి మంత్రి అన్నపూర్ణ దేవి నేడు న్యూఢిల్లీలో అధికారికంగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో బాల్య వివాహాలను అంతం చేయాలనే జాతీయ ప్రతిజ్ఞ మరియు దేశవ్యాప్తంగా ఉన్న స్ఫూర్తిదాయకమైన కథలను ప్రదర్శించే చిత్రం మరియు ఫ్రంట్‌లైన్ ఛాంపియన్‌ల సాక్ష్యాలు, సమిష్టి పురోగతిని జరుపుకోవడం మరియు మిషన్ యొక్క తదుపరి దశ కోసం బలపరిచే వేగాన్ని జరుపుకోవడం వంటివి ఉంటాయి. ఈ 100 రోజుల ప్రచారం ద్వారా, మహిళా మరియు శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా ఉన్న పౌరులు, సంస్థలు మరియు సమాజ నాయకులను ఉద్యమంలో చేరాలని మరియు బాల్య వివాహ రహిత భారత్‌ను నిర్మించాలనే భారతదేశం యొక్క నిబద్ధతను పునరుద్ఘాటించాలని పిలుపునిస్తుంది. సజావుగా సహకారం మరియు విస్తృతమైన అట్టడుగు వర్గాలకు చేరుకోవడానికి, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమం, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి మరియు విద్యా మంత్రిత్వ శాఖలతో సన్నిహిత సమన్వయంతో జాతీయ డ్రైవ్ అమలు చేయబడుతుందని ఇది జోడించింది. గత సంవత్సరం నవంబర్ 27న ప్రారంభించబడిన 'బాల్ వివాహ ముక్త భారత్' ప్రచారం గత నెల 27న ఒక సంవత్సరం పూర్తయింది.



# పాఠశాలల్లో పనులను వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, డిసెంబర్ 03 (తీన్మార్ న్యూస్): పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చేపట్టిన పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్న సివిల్ పనులు, భవిత కేంద్రాలు నిర్వహణ, మరుగుదొడ్లు, చిల్డ్రెన్ విత్ స్పెషల్ నీడ్స్ సదుపాయాలు, కేజీబీవీలు, మోడల్ పాఠశాలల అభివృద్ధి పనులు తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రెవెన్యూ, విద్యా, ప్రణాళిక టిజి ఈడబ్ల్యు ఐడిసి, పీఆర్ ఇంజినీరింగ్, ప్రణాళిక శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధి పనుల్లో ఎటువంటి ఆలస్యం జరుగకుండా వేగంగా పూర్తి చేయాలన్నారు. నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని, ముఖ్యంగా మరుగుదొడ్లు మరియు భవిత కేంద్రాల నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. సివిల్ పనుల పురోగతిని రోజువారీగా మానిటర్ చేసి, పూర్తి వివరాలను సమర్పించాలని ఆదేశించారు. విద్యార్థుల కోసం మౌలిక సదుపాయాలు వారి చదువు వాతావరణాన్ని మెరుగుపరిచేలా ఉండాలని పేర్కొన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి, నిర్ణీత గడువుల్లో పనులను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్, సిపిఓ బాబురావు, టిజిఈడబ్ల్యూ ఐడిసి ఈఈ అరుణ్ కుమార్, పిఆర్ ఈఈ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ సిబ్బందికి ర్యాండమైజేషన్ కార్యక్రమం

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, డిసెంబర్ 03 (తీన్మార్ న్యూస్): మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ సిబ్బందికి ర్యాండమైజేషన్ కార్యక్రమాన్ని సాధారణ ఎన్నికల పరిశీలకులు ఫణీంద్ర రెడ్డి, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ బుధవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సాధారణ పరిశీలకులు మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరిస్తూ టి పోల్ పోర్టల్ ద్వారా పిఓ, ఓపిఓలకు మొదటి విడత ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్లు తెలిపారు. భూపాలపల్లి డివిజన్ పరిధిలోని గణపురం, రేగొండ, కొత్తపల్లి గోరి, మొగుళ్లపల్లి మండలాలకు చెందిన 82 గ్రామ పంచాయతీలు, 712 వార్డుల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, ఓపిఓలకు ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా పోస్టింగ్‌లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఎన్నికల నియమావళిని పరిగణనలోకి తీసుకొని పారదర్శకంగా ర్యాండమైజేషన్ చేపట్టామని పరిశీలకులు వివరించారు. పిఓలు 855 మంది, ఓపిఓలు 1084 మంది మొత్తం 1939 మంది సిబ్బందిని రాండమైజేషన్ ద్వారా కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీపీఓ శ్రీలత ఇతర అధికారులు పాల్గొన్నారు.

# దివ్యాంగులు ఈ సమాజానికి స్ఫూర్తి ప్రదాతలు

## అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో



మహబూబాబాద్ జిల్లా, డిసెంబర్ 03 (తీన్మార్ న్యూస్): దివ్యాంగులు ఈ సమాజానికి స్ఫూర్తి ప్రదాతలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో అన్నారు. బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రం లోని గిరిజన భవన్ లో జిల్లా సంక్షేమ అధికారి సభిత అధ్యక్షతన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో మాట్లాడుతూ దివ్యాంగుల హక్కులు, అవకాశాలు, సామాజిక బాధ్యతల పై ముఖ్య సందేశాన్ని అందించారు. దివ్యాంగుల జీవన విధానాన్ని మెరుగుపరిచే దిశగా మరిన్ని సంక్షేమ చర్యలను తీసుకెళ్లేందుకు అధికారి వర్గం కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. దివ్యాంగులు ఈ సమాజానికి స్ఫూర్తి ప్రదాతలని, ప్రపంచ వేదికపై మన దేశ కీర్తిని చాటిన ఘనత దివ్యాంగులది అన్నారు. వారితో ఆత్మీయంగా మెలగాల్సిన బాధ్యత సమాజంలో ప్రతీ ఒక్కరికీ ఉందని సూచించారు. తదనంతరం జిల్లాకేంద్రంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో జిల్లాలోని పలు ప్రాంతాల నుండి విచ్చేసి పాల్గొని విజేతలుగా నిలిచిన దివ్యాంగ క్రీడాకారులకు బహుమతులు మరియు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ లు, సూపర్వైజర్లు, దివ్యాంగుల అసోసియేషన్స్, సంఘాల నాయకులు, సభ్యులు, పెద్దఎత్తున దివ్యాంగులు, మరియు సిబ్బంది బి. రాజు, ఎం. హరీష్, బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

# ఆరవ తరగతిలో ప్రవేశ పరీక్ష ఈ నెల 13న



మహబూబాబాద్, డిసెంబర్ 03 (తీన్మార్ న్యూస్): జవహర్ నవోదయ విద్యాలయ వరంగల్ జిల్లాలో 2026-27 విద్యా సంవత్సరంలో ఆరవ తరగతిలో ప్రవేశం కొరకు నిర్వహించే ప్రవేశ పరీక్ష 13.12.2025 వ తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లాలో నిర్వహించబడునని విద్యాలయ ప్రధానాచార్యులు బి.పూర్ణిమ నేడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షకు 5648 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు మరియు ఈ ప్రవేశ పరీక్షను ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 28 సెంటర్లలో నిర్వహించుటకు కావాలసిన ఏర్పాట్లు అన్నియు జవహర్ నవోదయ విద్యాలయ, వరంగల్ వారు చేసినారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆన్ లైన్ (www.navodaya.gov.in) లో హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకొనవలయును. ఇందుకు గాను అభ్యర్థులు సంబంధిత వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకొనేటప్పుడు వచ్చిన రిజిస్ట్రేషన్ నెంబర్ మరియు పుట్టిన తేదీని సమర్పించి హాల్ టికెట్ డౌన్ లోడ్ చేసుకొవలయును. ఆఫ్ లైన్ లో దరఖాస్తు చేసుకున్న వారు విద్యాలయ హెల్ప్ లైన్ నెంబర్ 9110782213 కి ఫోన్ చేసి తమ వివరాలు తెలిపి హాల్ టికెట్ ను పొందవచ్చునని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు.

# దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, డిసెంబర్ 03 (తీన్మార్ న్యూస్): దివ్యాంగులు ఎన్ని అడ్డంకులు ఉన్నా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఐడిఓసి కార్యాలయంలో మహిళా, శిశు, వయోవృద్ధుల దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ సివిల్, న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ అఖిల, ఎస్పీ సంకీర్త్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ దివ్యాంగుల అభివృద్ధి కోసం ప్రభుత్వం అన్ని రకాల సహకారాలు అందిస్తోందని తెలిపారు. సదరం సర్టిఫికెట్లు జారీతో పాటు భవిత కేంద్రాల ద్వారా విద్యా నైపుణ్యాభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు.

ఇటీవల డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో దివ్యాంగులు అద్భుత ప్రతిభ కనబరిచారని ప్రశంసిస్తూ, శాఖల ద్వారా అందుతున్న పథకాలను సద్వినియోగం చేసుకొని మరింత అభివృద్ధి సాధించాలని సూచించారు. మీ అభివృద్ధి అంటే సమాజ అభివృద్ధి అని, జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. తదుపరి న్యాయ సహకార సంస్థ ఛైర్మన్ అఖిల మాట్లాడుతూ వైకల్యం ఉన్న అనేక మంది దివ్యాంగులు చిత్రకళ, ఇతర రంగాల్లో ప్రతిభ కనబరిచి ఆదర్శంగా నిలుస్తున్నారు. దివ్యాంగుల హక్కులకు సంబంధించి కోర్టుకు వచ్చే దివ్యాంగులకు న్యాయవాదిని ఏర్పాటు చేసి పూర్తి న్యాయ సహాయాన్ని అందిస్తామని తెలిపారు. నేను చేయలేను అనే భావనను వదిలి, పాజిటివ్ ఆలోచనతో ముందుకు సాగాలని సూచించారు. జిల్లా ఎస్పీ సంకీర్త్ మాట్లాడుతూ దివ్యాంగులు డిజేబుల్ కాదని డిపెండబుల్ అన్నారు. దివ్యాంగులకు ప్రతిబంధకాలు విజయానికి అడ్డంకులు కావని, టాలెంట్ విషయంలో దివ్యాంగులు ఇతరులకంటే ఏమాత్రం తీసిపోరని తెలిపారు. లోపాలను గుర్తుచేసుకుంటూ ఆగకుండ, అవకాశాలను వినియోగించుకుంటూ ముందుకు సాగాలన్నారు. దివ్యాంగులలో అసాధ్యాన్ని సాధించే శక్తి ఉందని, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ మీకు అండగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మహిళా సంక్షేమ అధికారి మల్లేశ్వరి, డీఈఓ రాజేందర్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్, డీఆర్డిఓ బాలకృష్ణ, మెప్మా పిడి రాజేశ్వరి, హెచ్ఎమ్ఆర్టీ సంస్థ అధ్యక్షురాలు కే. రజిత, ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ అధ్యక్షులు అయిలి మారుతి, పారా ఒలంపిక్స్ జిల్లా అధ్యక్షులు కుమార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ సమక్షంలో జీపీ ఎన్నికల పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్



ములుగు జిల్లా, డిసెంబర్ 03 (తీన్మార్ న్యూస్): గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బంది రెండవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దివాకర టి.ఎస్., సాధారణ పరిశీలకుడు (ఎన్నికలు) ప్రశాంత్ కుమార్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆయిల్ ఫెడ్, హైదరాబాద్, సమక్షంలో బుదవారం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ జరిపించారు. ఈ ప్రక్రియను కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. జిల్లాలోని ఒక్కో మండలం వారీగా ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, ఓ.పీ.ఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. స్థానికత, విధులు నిర్వర్తిస్తున్న మండలం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని, ర్యాండమైజేషన్ ద్వారా స్థానికేతర సిబ్బందిని పోలింగ్ విధుల కోసం ఎంపిక చేశారు. జిల్లాలోని 146 గ్రామ పంచాయతీల సర్పంచ్, 1290 వార్డులు స్థానాలకు, 1306 పోలింగ్ స్టేషన్ లలో ఎన్నికల నిర్వహణ కోసం 20 శాతం రిజర్వ్ స్టాఫ్ కలుపుకుని ప్రిసైడింగ్ అధికారులతో పాటు, ఓ.పీ.ఓల ర్యాండమైజేషన్ జరిపారు. ర్యాండమైజేషన్ ప్రక్రియలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, డీపీఓ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలే మనకు ఆయుధం

## 109 గ్రామాల్లో సర్పంచ్ లు కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులే గెలవాలి



గీసుగొండ, డిసెంబర్ 03 (తీన్మార్ న్యూస్): బుధవారం గీసుగొండ మండలంలోని ఊకల్ క్రాస్ వద్ద గల ఎస్ఎస్ గార్డెన్ యందు గీసుగొండ మరియు సంగెం మండలాల పరిధిలోని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, బ్లాక్ స్థాయి నాయకులు, సమన్వయ కమిటీ సభ్యులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, బూత్ కమిటీ సభ్యులు మరియు పార్టీ ముఖ్య నాయకులతో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి గ్రామ పంచాయతీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులను గెలిపించాలని అన్నారు. ఆయా గ్రామాల్లోని ముఖ్యమైన నాయకులు చాలెంజ్ గా తీసుకుని 109 మంది సర్పంచులు కాంగ్రెస్ కండువాలతో తన వద్దకు తీసుకు రావాలి అన్నారు. గెలిచి వచ్చిన వారి గ్రామాల అభివృద్ధికి అధిక నిధులు ఇచ్చే బాధ్యత తనదనీ అన్నారు. సర్పంచ్ ఎన్నికలపై దిశా నిర్దేశం చేశారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లిఖార్జున ఖర్గే నాయకత్వంలో సీఎం రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న పథకాలు, మహిళలకు ఉచిత బస్సు, 500లకే గ్యాస్, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, రెండు లక్షల రుణ మాఫీ, వరికి రూ.500 బోనస్, రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత కరెంట్ వంటి పథకాలు చెప్పి ప్రజలను ఓట్లు అడగాలన్నారు. మన పార్టీ వారే ఓటమికి ప్రయత్నిస్తే సహించం అని హెచ్చరించారు. మన కాంగ్రెస్ పార్టీలో ఉంటూ కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి ఓటమికి ప్రయత్నం చేసే వారిని సహించబోమని పార్టీలో వారు ఎంతటి వారైనా క్షమించనన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక మెజారిటీ సీట్లు గెలుచుకుంటుంది, ప్రజలు కాంగ్రెస్ తోనే ఉన్నారు అని తెలిపారు.

# స్వచ్ఛమైన గాలిని కోరితే దేశద్రోహం కేసులు పెడతారా?

## ఢిల్లీ విద్యార్థి సంఘ నాయకులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

## పిడిఎస్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్ డిమాండ్




హనుమకొండ, డిసెంబర్ 03 (తీన్మార్ న్యూస్): బుధవారం పిడిఎస్యూ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ మొదటి గేటు వద్ద ధర్నా చేశారు. ఢిల్లీలో కలుషితమైన గాలిని నిరోధించాలని ఆందోళన చేసిన విద్యార్థి సంఘాల నాయకులపై పెట్టిన ఉపా, దేశద్రోహం కేసులు వెంటనే ఎత్తివేయాలని వారిని వెంటనే జైలు నుండి విడుదల చేయాలని ప్లే కార్డ్స్ పట్టుకొని నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్ మాట్లాడుతూ భారత దేశంలో స్వచ్ఛమైన గాలి కోరుకోవడం కూడా నేరంగా మారుతుందని రోజురోజుకు కేంద్రంలోని బిజెపి పాలనలో ప్రజాస్వామ్యం కరువైతుందని భావోద్వేగం వ్యక్తం చేశారు. ఢిల్లీలోని ఇండియన్ గేటు వద్ద స్వచ్ఛమైన గాలిని కోరుతూ ఆందోళన చేసిన విద్యార్థి సంఘ నాయకులను ఢిల్లీ పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి అక్రమ కేసులు పెట్టడం చెరసాలలో బంధించడం ఇప్పటివరకు పాలన వైఖరిని ప్రశ్నిస్తేనే ఉప దేశద్రోహం కేసులు పెట్టారు. దేశంలో పౌర హక్కులు ప్రజాస్వామ్యం ఈ బీజేపీ పాలనలో ఎంత గొప్పగా అమల్లో అర్థమవుతుంది. బిజెపి దేశ ప్రజల కొరకు కాకుండా రక్షణ బలగాలను తన గుప్పట్లో ఉంచుకొని ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తున్నది. ఈ విధమైన వైఖరిని ప్రజలు మేధావులు ప్రజాస్వామిక వాదులు ఖండించాలని దీనికి వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ యూ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గ సభ్యులు వంగెటి మోహన్ యూనివర్సిటీ నాయకులు రాజేష్, రాంబాబు,హరిప్రసాద్, జయ చందర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల సాధికారతే లక్ష్యంగా పనిచేయాలి

**దివ్యాంగులు ఈ సమాజానికి స్ఫూర్తి ప్రదాతలు**

**ప్రపంచ వేదికపై మన దేశ కీర్తిని చాటిన ఘనత దివ్యాంగులది**

**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**



ములుగు జిల్లా, డిసెంబర్ 03 (తీన్మార్ న్యూస్): దివ్యాంగుల సాధికారతే లక్ష్యంగా పనిచేయాలని, దివ్యాంగులు సమాజానికి స్ఫూర్తి ప్రదాతలని, ప్రపంచ వేదికపై మన దేశ కీర్తిని చాటిన ఘనత దివ్యాంగులదని, వారితో ఆత్మీయంగా మెలగాల్సిన బాధ్యత సమాజంలో ప్రతీ ఒక్కరికీ ఉందని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని "సామాజిక పురోగతిని ముందుకు తీసుకు వెళ్ళడానికి దివ్యాంగులను కలుపుకునే సమాజాన్ని రూపొందించడం అనే నేపథ్యంతో ములుగు జిల్లా కేంద్రం లోని గిరిజన భవన్ లో జిల్లా సంక్షేమ అధికారి తుల రవి అధ్యక్షతన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. దివ్యాంగుల హక్కులు, అవకాశాలు, సామాజిక బాధ్యతల పై ముఖ్య సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులు ఈ సమాజానికి స్ఫూర్తి ప్రదాతలని, ప్రపంచ వేదికపై మన దేశ కీర్తిని చాటిన ఘనత దివ్యాంగులది అన్నారు. వారితో ఆత్మీయంగా మెలగాల్సిన బాధ్యత సమాజంలో ప్రతీ ఒక్కరికీ ఉందని సూచించారు. అనంతరం దివ్యాంగుల సంక్షేమం సంఘం ఆధ్వర్యంలో తెలియజేసిన పలు డిమాండ్లపై కలెక్టర్ స్పందించించి ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. దివ్యాంగులు ఉపాధి హామీలో కూడా నిర్దేశించిన లక్ష్యం మేరకు పనిదినాలు పూర్తిచేయాలని, అలాగే దివ్యాంగులు దివ్యాంగుల స్వయం సహాయ సంఘాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల వడ్డీలేని ఋణాలు వస్తాయి. కాబట్టి వాటిని వినియోగించుకొని ఆర్థిక స్థిరత్వం సాధించాలని దివ్యాంగులకు సూచించారు. ములుగు జిల్లాలో దివ్యాంగుల విద్య, ఆరోగ్యం, ఉపాధి, సామాజిక భద్రత రంగాల్లో వారికి సేవలు అందించేందుకు మరింత అంకితభావంతో పనిచేయడానికి కట్టుబడి ఉ న్నామని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ మహేందర్ జీ మాట్లాడుతూ అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించాల్సిన ఆవశ్యకతను గుర్తు చేస్తుందని, అందులో భాగంగానే దివ్యాంగుల సామర్థ్యాలు, ప్రతిభను వెలికితీసే విధంగా ఇలాంటి వేదికలను ఏర్పాటుచేయడం దివ్యాంగుల పురోభివృద్ధికి దోహదపడుతుందని ఆకాంక్షించారు. మన సమాజం మరింత సమగ్రతతో, అభివృద్ధి దిశగా సాగాలంటే దివ్యాంగులను ప్రోత్సహించడం, వారి కోసం సౌకర్యాలు కల్పించడం మన బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా జిల్లా సంక్షేమాధికారి తుల రవి స్వాగతోపన్యాసం చేస్తూ దివ్యాంగులు దైవంతో సమానం అని, వారు విభిన్న ప్రతిభా పాటవాలు కలిగిన వారని అన్నారు. మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధులు మరియు ట్రాన్స్ జెండర్ల సంక్షేమ శాఖ ద్వారా జిల్లాలో ఇప్పటివరకు దివ్యాంగులకు అందించిన సేవలను వివరించారు. దివ్యాంగుల కొరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నాయని, అర్హులైన దివ్యా%శీ%గులు వాటిని వినియోగించుకొని స్వయం సమృద్ధిని సాధించాలని కోరారు. అనంతరం దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇప్పటివరకు చేపట్టిన వివిధ కార్యక్రమాలను గూర్చి వివరించారు. డి ఆర్ డి ఓ శ్రీనివాస్ మాట్లాడుతూ దివ్యాంగులు తాము ఒంటరి అన్న భావనలో ఎప్పుడూ ఉండరాదని, సమాజం కూడా వారికి తోడుగా, వారి ఎదుగుదలలో అండగా నిలవాల్సిన అవసరముందని అన్నారు. ప్రభుత్వం కూడా ఈ రోజు కార్యక్రమ ముఖ్య నేపథ్యం అయిన "సామాజిక పురోగతిని ముందుకు తీసుకు వెళ్ళడానికి దివ్యాంగులను కలుపుకునే సమాజాన్ని రూపొందించడం" అనే నినాదం స్ఫూర్తిగా డి ఆర్ డి ఏ ద్వారా దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా దివ్యాంగుల స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేయడం జరుగుతు%శీ%దని, తద్వారా దివ్యాంగులు ఐక్యతతో వారి సమస్యలపైన చర్చించుకునే వీలుండడంతో పాటు, ఎవరిపైనా ఆధార పడకుండా ఈ సంఘాల ద్వారా దివ్యాంగులు అంతా కలిసికట్టుగా ఆర్థికంగా ఎదిగే అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే దివ్యాంగులైన చిన్నారుల్లో ఏమైనా ఇబ్బందులు ఉంటే డి ఆర్ డి ఏ ద్వారా ఏటూరునాగారం %డ% మంగపేట మండలాల్లో దివ్యా%శీ%గుల కొరకు ప్రత్యేక నైబర్ హుడ్ కేంద్రాలు ఏర్పాటుచేయడం జరిగిందని, వీటిల్లో ఒక స్పీచ్ థెరపిస్ట్, ఫిజియో థెరపిస్ట్ మరియు కౌన్సిలర్ లు ప్రతినెల 1వ 16వ తారీఖులో మంగపేటలో అలాగే 8 వ, 23 వ తారీఖులో ఏటూరునాగారం లో అందుబాటులో ఉ ంటారని కావున జిల్లాలో అవసరమున్న దివ్యాంగులు ఈ సదుపాయాలను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం దివ్యాంగుల సంక్షేమం కోసం డి ఆర్ డి ఏ ద్వారా జిల్లాలో చేసిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా దివ్యా%శీ%గుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పెద్దబోయిన శ్రీనివాస్ సంయుక్తంగా మాట్లాడుతూ దివ్యాంగులు ఆత్మ న్యూనతతో కాకుండా ధైర్యంగా లక్ష్యం వైపు అడుగువేయాలని సూచించారు. ఒకప్పుడు సమాజంలో దివ్యాంగులు అంటే చిన్న చూపు ఉండేదని, సామాజిక అభివృద్ధి, అందరూ చదువుకోవడం తో ముఖ్యంగా దివ్యాంగుల్లో తమ హక్కులపై స్పష్టమైన అవగాహన, ఆత్మ గౌరవం పై బలమైన పట్టుదల ఏర్పడిందని అన్నారు. దివ్యాంగుల సంరక్షణ, అభివృద్ధి, సంక్షేమం కొరకు 2016వ సం.లో ప్రత్యేక చట్టాన్ని చేయడం జరిగిందని, ఈ చట్టాన్ని దివ్యాంగులు తప్పక వినియోగించుకోవాలని సూచించారు. అలాగే దివ్యాంగుల రక్షణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, ఈ చట్టంపై క్షేత్ర స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని, బ్యాంక్ తో సంబంధం లేకుండా ప్రభుత్వం నేరుగా ఋణాలు మంజూరు చేసేలా చూడాలని, దివ్యాంగులకు ప్రత్యేక స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని. సదరం క్యాంపులో దివ్యాంగ కమిటీ సభ్యులను భాగస్వామ్య%శీ% చేయాలని వారి డిమాండ్లతో కూడిన వివిధ అంశాలను జిల్ కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్ళారు. అలాగే దివ్యాంగులలో ఉన్న ప్రతిభను వెలికి తీసేలా జిల్లాలో దివ్యాంగులకు క్రీడలు మరియు ఇతర స్ఫూర్తివంతమైన కార్యక్రమాలు నిర్వహించిన డి డబ్ల్యూ ఓ, డి ఆర్ డి ఓ లకు ధన్యవాదాలు తెలిపారు. ఆ తదుపరి దివ్యాంగుల అభివృద్ధి, సంక్షేమం వారి ఎదుగుదల కోసం అంతా కట్టుబడి ఉంటామని ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారిచేత ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. తదనంతరం గతవారం జిల్లాకేంద్రం లో నిర్వహించిన క్రీడా పోటీల్లో జిల్లాలోని పలు ప్రాంతాల నుండి విచ్చేసి పాల్గొని విజేతలుగా నిలిచిన దివ్యాంగ క్రీడాకారులకు అందరికీ ముఖ్య అతిథి చేతుల మీద మెడల్స్, బహుమతులు మరి ప్రశంసా పత్రాలను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఏ, ఏ పి డి లు, దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా నాయకులు పూజారి మాణిక్యం, కనకం రాజు, సంఘం సభ్యులు, జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కార్యక్రమ ఇంచార్జ్ నాగేంద్ర, కొర్ర శంకర్, మహమ్మద్ మీర్జా బేగ్, ఎఫ్ ఆర్ ఓ గణేష్, డి సిపి ఓ ఓంకార్, డి సి పి యు, సి హెచ్ ఎల్, సఖి విభాగాల సిబ్బంది, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

# రాజేష్ మృతికి కారకులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

**రిటైర్డ్ హైకోర్టు జడ్జితో రాజేష్ మృతి పై విచారణ జరపాలి**

**పోలీసుల చిత్రహింసలతోనే రాజేష్ మృతి**

**మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు తల్లమల్ల హస్సేన్**



కోదాడ, డిసెంబర్ 03 (తీన్మార్ న్యూస్): దళిత మాదిగ యువకుడు రాజేష్ మృతి కేసులో కారకులపై 306, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది తల్లమల్ల హస్సేన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కోదాడ పట్టణంలో రాజేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. సీఎం రిలీఫ్ ఫండ్ లో అక్రమాలు జరిగాయి అంటూ నాలుగు రోజులపాటు పోలీసులు చిలుకూరు, కోదాడ రూరల్ స్టేషన్లకు తిప్పి చిత్రహింసలు పెట్టడం మూలంగానే రాజేష్ మరణించాడని ఆయన ఆరోపించారు. దీనికి బాధ్యులైన పోలీసులపై కేసు నమోదు చేయాలన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న రాజేష్ కు మెరుగైన వైద్యం అందించకుండా తన తల్లి ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స అందిస్తానన్న వినకుండా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని అన్నారు. రాజేష్ పై ఎఫ్ ఐ ఆర్ చేయకుండా నాలుగు రోజులపాటు రాత్రి పగలు ఎలా విచారణ చేస్తారని పోలీసులను ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ ఎస్పీ నేటి వరకు కూడా వారి కుటుంబాన్ని పరామర్శించకపోవడం బాధాకరమన్నారు. వెంటనే ప్రభుత్వం బాధిత కుటుంబానికి ఐదు ఎకరాల భూమితో పాటు ప్రభుత్వ ఉద్యోగం ఇందిరమ్మ ఇల్లు కోటి రూపాయలు పరిహారం అందించాలన్నారు. లేనిపక్షంలో దళితుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వెంటనే రిటైర్డ్ హైకోర్టు జడ్జి పర్యవేక్షణలో సమగ్ర విచారణ జరిపించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షులు పిడతల శ్రీనివాస్ మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి దాసరి దేవయ్య, మాల మహానాడు సూర్యాపేట జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లచ్చిమళ్ల రామ్మోహన్ రావు, సూర్యాపేట జిల్లా నాయకులు గాదరి మధు, కాసిమల్ల వెంకట నరసయ్య, బిజెపి జిల్లా నాయకులు పిడతల శంకర్, ఎంఎస్పి, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి, ఏపూరి రాజు మాదిగ,ఎంఎస్పి రాష్ట్ర నాయకులు కొండపల్లి ఆంజనేయులు, యలమర్తి రాము, వడ్డేపల్లి కోటేష్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి ఏపూరి సత్యరాజు, ఎమ్మార్పీఎస్ పట్టణ ఉపాధ్యక్షులు సోమపంగు సురేష్, ఎమ్మార్పీఎస్ పట్టణ నాయకులు పాముల శ్రావణ్, రాయల గోపి లు పాల్గొన్నారు.

# ఈవీఎం గోడౌన్ ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, డిసెంబర్ 03 (తీన్మార్ న్యూస్): బుధవారం ఆర్డీవో కార్యాలయం ప్రాంగణంలో ఈవీఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈవీఎం భద్రతకు సంబంధించి మూడు నెలలకు ఒకసారి తనిఖీ చేయడం జరుగుతుందని, ఇందులో భాగంగా బుధవారం ఈవీఎం గోడౌన్ ను సందర్శించడం జరిగిందని తెలిపారు. ఈ పరిశీలనలో భాగంగా ఈవీఎం, వీవీ ప్యాట్లు ఉన్న గదిని, సీసీ కెమెరా గదిలో కెమెరాల పనితీరును పరిశీలించారు. అనంతరం ఆయన గోడౌన్ పరిసర ప్రాంతంలో పరిశుభ్రంగా ఉంచాలని, అనుమతి లేనిదే ఎవరిని లోపలికి అనుమతించరాదని అధికారులకు సెక్యూరిటీ గార్డ్ కు తెలిపారు. అనంతరం తనిఖీ రిజిస్టర్లు సంతకం చేశారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట కొత్తగూడెం ఆర్డీవో మధు, ఎన్నికల సూపర్డెంట్ రంగ ప్రసాద్, పొలిటికల్ పార్టీ నోముల రమేష్ బిజెపి, లక్ష్మణ అగర్వాల్ కాంగ్రెస్ పార్టీ, హమ్ ఆప్ ది పార్టీ అవుటుపల్లి రాంబాబు, సిపిఎం పార్టీ ఎండి. సలీం ఎన్నికల సిబ్బంది నవీన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ పోరాటం నేటి తరానికి స్ఫూర్తి

**ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్**




హనుమకొండ, డిసెంబర్ 03 (తీన్మార్ న్యూస్): బాలసముద్రంలోని భారత రాష్ట్ర సమితి పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో దీక్షా దివస్ లో భాగంగా ఈ నెల 5న పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్న వ్యాస రచన పోటీల పోస్టర్ బీఆర్ఎస్వీ నేతలతో కలిసి దాస్యం వినయ్ భాస్కర్ బుధవారం రోజున ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ 60 ఏండ్ల తెలంగాణ గోసను తీర్చిన ఉద్యమ నేత కేసీఆర్ అని అన్నారు. 14 ఏండ్లు తెలంగాణ స్వరాష్ట్ర ఏర్పాటునకు జరిపిన పోరు, 10 ఏండ్లు తెలంగాణ ముఖ్యమంత్రిగా కేసీఆర్ చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి నేటి తరానికి తెలియాల్సిన అవసరం ఉంది కేసీఆర్ పట్టుదల, లక్ష్య సాధన, పోరాట పటిమ విద్యార్థులకు చదువుల్లో కష్టపడడానికి స్ఫూర్తిని ఇస్తుంది తెలిపారు. వ్యాస రచన పోటీల ద్వారా విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానం పెంపొందుతుందని, పోటీ తత్వం పెరుగుతుందని అన్నారు. కాగా దీక్షా దివస్ లో భాగంగా ఈ నెల 5న శుక్రవారం రోజున బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష అనే అంశం పై ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సంకు నర్సింగ రావు, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, కుసుమ లక్ష్మీ నారాయణ, నాయకులు పులి రజినీకాంత్, వెంకన్న, జానకి రాములు, నాయీముద్దీన్, మనోజ్ కుమార్, సదాంత్, ఖలీల్, శ్రీధర్, శ్రీకాంతా చారి, చందర్, పుల్లయ్య, రమేష్, బుద్దె వెంకన్న, హరినాథ్, ప్రభాకర్, కొండ్ర శంకర్, రాజు, బీఆర్ఎస్వీ నాయకులు బైరపాక ప్రశాంత్, సూర్య కిరణ్ వర్మ, గండ్రకోట రాకేష్ యాదవ్, వీరాస్వామి, పస్తం అనిల్, స్నేహిత్, రాజేష్, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

# టీఆర్పీ సర్పంచ్ అభ్యర్థిగా హారిక జవహర్లాల్ నామినేషన్ దాఖలు



భూపాలపల్లి, డిసెంబర్ 03 (తీన్మార్ న్యూస్): జయశంకర్ భూపాలపల్లి నియోజకవర్గ పరిధిలోని సూర్య నాయక్ తండా గ్రామం నుండి తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) సర్పంచ్ అభ్యర్థిగా గూగులోతు హారిక జవహర్లాల్ (తీన్మార్ జై) నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్పీ పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్, టీఆర్పీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు వెంకటేష్ గౌడ్, హనుమకొండ జిల్లా మహిళా అధ్యక్షురాలు బాలినే లక్ష్మి, బాలినే జగన్మోహన్, సత్యనారాయణ పాల్గొని అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ రవి పటేల్ తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని కామారెడ్డి డిక్లరేషన్‌లో చెప్పి ప్రజలను మభ్యపెట్టి అధికారం దక్కించుకున్న కాంగ్రెస్ పార్టీని స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఓడించాలని కోరుతున్నాం. టీఆర్పీ పార్టీ లక్ష్యం పేద ప్రజలకు విద్య, వైద్యం, సత్వర న్యాయం, భూమిలేని నిరుపేదలకు రెండు ఎకరాలు అందించడం. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల ఆర్థిక సామాజికాభివృద్ధి కోసం పుట్టిన పార్టీ తెలంగాణ రాజ్యాధికార పార్టీ. ఇది బహుజనుల పార్టీ, ప్రజల పార్టీ. టీఆర్పీ ప్రతిపాదించిన అభ్యర్థిని ప్రజలు భారీ మెజారిటీతో గెలిపిస్తే గ్రామ అభివృద్ధి వేగవంతమవుతుంది. నిస్వార్థంగా సేవ చేయడానికి ముందుకొచ్చిన యువ సర్పంచ్ అభ్యర్థి హారికను స్వచ్ఛందంగా గెలిపించండి. ఆమె గ్రామాభివృద్ధి కోసం కష్టపడి పనిచేస్తుంది అని రవి పటేల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా నాయకులు ఇనుగాల ప్రణయ్ రాజ్, జినుకల శ్రీను, సామల చంద్రశేఖర్, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

# నివాళులర్పించిన మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా రామకృష్ణ



పరకాల, డిసెంబర్ 03 (తీన్మార్ న్యూస్): పరకాల మున్సిపాలిటీ పరిధి ఒకటో వార్డుకు చెందిన రిటైర్డ్ హెడ్మాస్టర్ ఆకునూరి విజయ్ కుమార్ తల్లి ఆకునూరి దేవకరుణ సుందర్ రావు ఇటీవలే మరణించారు. ఈరోజు మూడవ దినం సందర్భంగా సిఎస్ఐ మిషన్ స్కూల్ దగ్గరలోని వారి గృహంలో వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియపరిచిన పరకాల పట్టణ సమన్వయ కమిటీ సభ్యులు మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీ సోదా రామకృష్ణ, ఎస్సి విభాగం అధ్యక్షులు బొమ్మకంటి చంద్రమౌళి, మాజీ కౌన్సిలర్స్ ఏకు రాజు, నల్లెల్ల అనిల్ కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ నాయకులు గూడెల్లి సదన్ కుమార్, ఎండి అలీ, మునిగంటి విష్ణువర్ధన్, బొచ్చు జెమిని, నాయకులు బొచ్చు కుమార్ , తదితరులు నివాళులర్పించారు.

# జ్యోతి మానసిక వికలాంగుల స్కూల్లో వికలాంగుల దినోత్సవం

## మాజీ కౌన్సిలర్ మడికొండ. సంపత్ కుమార్



పరకాల, డిసెంబర్ 03 (తీన్మార్ న్యూస్): మాజీ కౌన్సిలర్ హాజరై కేక్ కట్ చేసి విద్యార్థిని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపి స్వీట్స్ తినిపించినాడు. మాజీ కౌన్సిలర్ మాట్లాడుతూ వికలాంగులు ఎందులోనూ తీసిపోమన్న నమ్మకం, ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని, వారిపై వివక్ష చూపకుండా వారిలోని నైపుణ్యాన్ని గుర్తించి ప్రోత్సహిస్తే అన్ని రంగాల్లో రాణిస్తారని, ఎంతోమంది దివ్యాంగులు అద్భుతాలు సృష్టించారని వారిని స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ ఎదగాలని, లోపం ఉన్నదని బాధపడవద్దని లోపం ఉన్న వాళ్లకు దేవుడు అంతకుమించిన శక్తిని ప్రసాదిస్తాడని, దివ్యాంగులు చదువుకొని ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలని కోరినారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు, సిస్టర్ క్లోటోమో, ఆయాలు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీకి షాక్

## వేణారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన కొప్పు వీరస్వామి



సూర్యాపేట, డిసెంబర్ 03 (తీన్మార్ న్యూస్): గుంజలూరు గ్రామ బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కొప్పు వీరస్వామి బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వనికి రాజీనామా చేసి సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వేణారెడ్డి మాట్లాడుతూ ఛివ్వేంల మండలంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని,ప్రతి గ్రామంలో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తున్నామని ధీమా వ్యక్తం చేసారు. గ్రామాల అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ధరావత్ వీరన్న నాయక్ గ్రామ శాఖ అధ్యక్షుడు దొనకొండ శ్రీనివాస్ యువజన కాంగ్రెస్ నాయకులు దొనకొండ మహేష్వీ రబోయిన అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ స్నేహ శబరీష్





హనుమకొండ జిల్లా, డిసెంబర్ 03 (తీన్మార్ న్యూస్): నామినేషన్ల స్వీకరణ కేంద్రాలలో నామినేషన్ల ప్రక్రియను హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ బుధవారం పరిశీలించారు. హనుమకొండ జిల్లాలో మూడో విడత నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైన దామెర క్లస్టర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో దామెర, ల్యాదెళ్ళ గ్రామ పంచాయతీలకు, ఒగ్లాపూర్ క్లస్టర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఒగ్లాపూర్, దమ్మన్నపేట గ్రామపంచాయతీలకు సర్పంచ్, వార్డు స్థానాలకు రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు నామినేషన్లను స్వీకరిస్తుండగా కలెక్టర్ పరిశీలించారు. క్లస్టర్ గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద ఉన్న ఎలక్షన్ నోటీస్, రిజర్వేషన్ల జాబితా లను పరిశీలించారు. ఆర్వోలు, ఏఆర్వోలతో నామినేషన్ల ప్రక్రియ గురించి కలెక్టర్ మాట్లాడి తెలుసుకున్నారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాల వద్ద ఏర్పాట్లను, నామినేషన్ల ప్రక్రియను ఎంపీడీవో కల్పన జిల్లా కలెక్టర్ కు వివరించారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాల వద్ద అధికారులు, సిబ్బంది, పోలీస్ భద్రత గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి తప్పిదాలు, పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం నియమ, నిబంధనలకు అనుగుణంగా

నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో పరకాల ఆర్డిఓ డాక్టర్ కన్నం నారాయణ, తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం

## జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద




వరంగల్ జిల్లా, డిసెంబర్ 03 (తీన్మార్ న్యూస్): వరంగల్ జిల్లాలోని వెల్ఫేర్ హాస్టల్స్, గురుకులాలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీవీబీల్లో) ఏర్పాటు చేసిన ప్రత్యేక కంప్లైంట్ బాక్స్‌లకు అందిన ఫిర్యాదులపై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బుధవారం జిల్లా కలెక్టరేట్ ఛాంబర్లో సంబంధిత శాఖాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. విద్యార్థుల సమస్యలను అత్యంత ప్రాధాన్యంగా పరిగణించి, హాస్టల్ నిర్వహణలో లోపాలుంటే తక్షణమే సరిదిద్దాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

సమీక్షలో ముఖ్యంగా ఈ సందర్భంగా విద్యార్థుల నుండి పలు సమస్యలపై ఫిర్యాదుల పెట్టె ద్వారా అందిన ఫిర్యాదులను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులు అందించిన పిర్యాదులను పరిగణలోకి తీసుకుని

వాలీబాల్ కోర్టులు, మెడికల్ చెక్ అప్ కోసం మెడికల్ సూపర్వైజర్ ఏర్పాటు చేయాలని, నాణ్యత లోపం గల ఆహారం అందిస్తున్నారని, పేరెంట్స్ తో మాట్లాడడానికి టెలిఫోన్ సౌకర్యం కల్పన,భోజనం నాణ్యత, రోజువారీ సరఫరాపై అందిన ఫిర్యాదులు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, వాటిని వెంటనే పరిష్కరించేలా సంబంధిత విభాగాల అధికారులకు కలెక్టర్ కఠిన ఆదేశాలు జారీ చేశారు. అధికారులు వెంటనే చర్యలు చేపట్టి నివేదిక సమర్పించాలన్నారు. గీజర్స్, బ్లాంకెట్స్ లభ్యతపై ప్రత్యేక సమీక్ష చేసి హాస్టల్స్‌లో చలికాలం వేడి నీటి సౌకర్యం (గీజర్స్) లభ్యతపై కలెక్టర్ ప్రత్యేకంగా సమీక్షించారు. అవసరమున్న హాస్టల్స్ వివరాలతో కూడిన నివేదికలను తక్షణమే సమర్పించాలని సంక్షేమ విభాగ అధికారులను ఆదేశించారు. ప్రతి రెసిడెన్షియల్ పాఠశాల, హాస్టల్ వారీగా హాట్ వాటర్ గీజర్స్, ఉలెన్ బ్లాంకెట్స్ వంటి తగిన వసతులు అందుబాటులో ఉన్నాయా లేదా అని పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. హాస్టల్ విద్యార్థుల వసతి, భోజనం, శుభ్రత, భద్రత, రోజువారీ ఆహార సరఫరా, డీలర్ల ద్వారా బియ్యం%-%పప్పులు వచ్చే విధానం, ఆహార నాణ్యతపై కలెక్టర్ సమగ్రంగా ఆదేశాలు జారీ చేశారు. సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, ఎస్సీ వెల్ఫేర్, మైనారిటీ వెల్ఫేర్, తెలంగాణ మోడల్ స్కూల్స్, కేజీవీబీ హాస్టల్స్ సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆమె స్పష్టం చేశారు. హాస్టల్స్‌లో పారదర్శకత, బాధ్యతాయుత నిర్వహణకు అధికారులు, వార్డెన్‌లు, సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి పుష్పలత, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారులు భాగ్యలక్ష్మి, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి సౌజన్య, మైనారిటీ వెల్ఫేర్ అధికారి రమేష్, , జి సి డి ఓ ఫ్లోరెన్స్, ఆర్ సి ఓ లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పోస్టల్ బ్యాలట్ పత్రాల పంపిణి సక్రమంగా జరగాలి

## జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



జనగాం, డిసెంబర్ 03 (తీన్మార్ న్యూస్): గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా పోస్టల్ బ్యాలట్ పత్రాలను సర్వీస్ ఓటర్లకు, ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులకు సరిగ్గా పంపిణి జరగాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. పోస్టల్ బ్యాలట్ పంపిణి, నిర్వహణ మీద బుధవారం అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ తో కలిసి జడ్పీ సీఈఓ, డిపి ఓ, అన్ని మండలాల ఎంపీడీఓ లు, తహసీల్దార్ లతో, ఎంపీవో లతో కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గూగుల్ మీటింగ్ ద్వారా రివ్యూ చేసారు. ముందుగా పోస్టల్ బ్యాలట్ పంపిణి, నిర్వహణ తదితర అన్ని ప్రక్రియలకు సంబందించి మాస్టర్ ట్రైనర్ రామరాజు పవర్ పాయింట్ ప్రసెంటేషన్ ద్వారా అధికారులకు క్షుణ్ణం గా అవగాహన కల్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మొదటి విడత పోలింగ్ జరిగే మండలాల్లో ఈ నెల 9 వ తేదీన

ఎంపిడిఓ కార్యాలయం లో పోస్టల్ బ్యాలెట్ కోసం ఫెసిలిటేషన్ కేంద్రం కు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. రెవెన్యూ శాఖ అధికారి గెజిటెడ్ అధికారిగా ఫారం 17 లో సంతకం చెయ్యడానికి అందుబాటులో ఉంటారన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల అధికారి దానికి సంబంధించిన వివరాలు నమోదు చేస్తారన్నారు. ఎవరికి అయితే పోస్టల్ బ్యాలట్ ఇస్తున్నామో వారి వివరాలు ఒక రిజిస్టర్ లో నమోదు చేయాలన్నారు. ఓటరు సహాయక కేంద్రం లో ఓటింగ్ గోప్యతకు భంగం కలగకుండా ఓటింగ్ కంపార్ట్ మెంట్ ఏర్పాటు చేయాలన్నారు. సర్వీస్ ఓటర్లకు పోటీ చేస్తున్న అభ్యర్థుల జాబితా తయారు అయిన తర్వాత 24 గంటల్లోపు పోస్ట్ ద్వారా గ్రామ పంచాయతీ ఎన్నికల అధికారి పంపాలన్నారు. వివరాలను రికార్డు చేయాలి అని సూచించారు. అలాగే పోస్టల్ బ్యాలెట్ తిరిగి %ఎజూఎశీ% కార్యాలయం కు చేరినపుడు సంబంధిత ఎన్నికల అధికారి చేరిన సమయం తేదీ రికార్డు చేయాలని కౌంటింగ్ కు సమయానికి ఒక గంట ముందు చేరిన అన్ని పోస్టల్ బ్యాలెట్ లను కౌంటింగ్ కు అనుమతిస్తారన్నారు. bజిల్లా స్థాయిలో కలెక్టరెట్ AO, మండల స్థాయిలో తహసీల్దార్ లు నోడల్ ఆఫీసర్ గా ఉంటారని మొత్తం ప్రక్రియ వీడియో గ్రాఫి చేయలని పోటీ చేసే అభ్యర్థులు కూడా ఈ ప్రక్రియను పరిశీలించవచ్చున్నారు. పోలింగ్ కు సంబంధించిన ఏర్పాట్లు చేసుకోవాలని ఎంపిడిఓ లను ఆదేశించారు. పోలింగ్ జరిగే ప్రాంతాలలో photo voter slip పంపిణీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. మొదటి విడత పోలింగ్ జరిగే మండలాల్లో ఈ నెల 6 న పోలింగ్ అధికారులకు రెండో విడత శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.రేపు మొదటి విడత పోలింగ్ జరిగే మండలాల్లో అభ్యర్థుల తో ఎన్నికల వ్యయానికి సంబంధించిన అవగాహన కార్యక్రమ మును ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమలో అభ్యర్థులు, మండల స్థాయి అధికారులు అభ్యర్థులు పాల్గొనాలన్నారు.

# ఎన్నికల విధులను పక్కాగా నిర్వహించాలి

## జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద

## పలు మండలాల్లో నామినేషన్ల ప్రక్రియను తనిఖీ చేసిన కలెక్టర్




వరంగల్ జిల్లా, 3 డిసెంబర్ 03 (తీన్మార్ న్యూస్): ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటిస్తూ నామినేషన్ల ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని, ఎన్నికల విధుల పట్ల జాగరూకతతో వ్యవహరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. నెక్కొండ మండలం అమిన్ పేట క్లస్టర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో, చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి క్లస్టర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నామినేషన్ ఫారంలు, రిజిస్టర్లను పరిశీలించారు. మూడవ విడతలో మొదటి రోజు సర్పంచ్, వార్డు స్థానాలకు దాఖలైన నామినేషన్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, అప్పీళ్ల పరిష్కారం, గుర్తుల కేటాయింపు, పోటి చేసే అభ్యర్థుల ప్రకటన తదితర ప్రక్రియలు పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సర్పంచ్, వార్డు స్థానాలకు వచ్చిన నామినేషన్ల వివరాలను వెంటనే రోజు వారీగా ఆన్లైన్ లో అప్లోడ్ చేయాలని అన్నారు. అభ్యర్థులు అన్ని వివరాలతో నామినేషన్ పత్రాలను దాఖలు చేసేలా హెల్ప్ డెస్క్ ద్వారా అవగాహన కల్పించాలని, సందేహాలు నివృత్తి చేయాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి కట్టుబడి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లు జరుగకుండా ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని, క్షేత్ర స్థాయిలో ఎన్నికల సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట డిబిసిడిఓ పుష్పలత, సంబంధిత అధికారులు ఉన్నారు.

# దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

**ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం**

**అలరించిన దివ్యాంగుల సాంస్కృతిక ప్రదర్శనలు**




హనుమకొండ జిల్లా, డిసెంబర్ 03 (తీన్మార్ న్యూస్): దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో జీవితంలో ముందుకు సాగాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. బుధవారం హనుమకొండ అంబేద్కర్ భవన్ లో జిల్లా మహిళా, శిశు,దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా జిల్లా సంక్షేమ అధికారి జె. జయంతి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ దివ్యాంగుల నుండి నేర్చుకోవాల్సిన చాలా విషయాలు మనకెంతో ఉన్నాయని, ఇక్కడ మీరు చేసిన ప్రదర్శనలతో తెలుస్తుందని పేర్కొన్నారు. ఏదో కావాలి అనుకునే మిగతా వారి కంటే ఉన్నంతలోనే మీరంతా ఎంతో సంతోషంగా ఉన్నారని ఈ కార్యక్రమం ద్వారా తెలుస్తుందన్నారు. మిగతా వారితో దయ, కరుణ, సహానుభూతి, ఆత్మ గౌరవం, ఆత్మవిశ్వాసంతో ఉంటారని అన్నారు. ఇలాంటి లక్షణాలు అందరిలో ఉంటే ఇంకా ఎక్కువగా పరస్పర గౌరవం సమాజంలో ఉ ంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. పెన్షన్లు, భవిత కేంద్రాలు, స్కాలర్ షిప్పులు, ప్రత్యేక స్వయం సహాయక సంఘాలు, విద్యా, ఉపాధి, గృహ కల్పనలో దివ్యాంగులకు ప్రత్యేక కోటా ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. మనమున్న ఈ సమాజంలో మీరు కూడా ఎంతో ముఖ్యమైన భాగం అని పేర్కొన్నారు. సమాన గౌరవం ఇస్తే అందరికన్నా చాలా వేగంగా ముందుకు వెళ్తారనే ఉద్దేశంతోనే వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చాలామంది ఎన్నో నైపుణ్యాలు కనబరిచారని, మంచి చిత్రకారులు, డాన్సర్లు సింగర్లు ఉన్నారని చెప్పారు. దివ్యాంగులు కృషి పట్టుదలతో రాణిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. దివ్యంగుల శక్తి సామర్థ్యాలకు ఎలాంటి పరిమితులు, హద్దులు లేవని అన్నారు. మనం అనుకుంటే తప్ప శక్తి సామర్థ్యాలకు ఎలాంటి పరిమితులు లేవని చెప్పారు. అందుకు సమాజానికి మీరే ఉదాహరణ అని పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం తరఫున దివ్యాంగులకు సహాయ సహకారాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. దివ్యాంగుల సౌకర్యార్థం కోసం అంబేద్కర్ భవన్, కలెక్టరేట్ లో ర్యాంపు సౌకర్యం ఏర్పాటు చేయుటకు తక్షణ చర్యలు తీసుకుంటానని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి జయంతి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం డిసెంబర్ 3వ తేదీన అంతర్జాతీయ దినోత్సవ వేడుకలను నిర్వహించుకుంటామని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో దివ్యాంగ బాల బాలికలు ఉత్సాహంగా పాల్గొంటారని తెలిపారు. దివ్యాంగులకు బ్యాంకు రుణాలు మంజూరు ఉంటుందన్నారు. దివ్యాంగులకు ప్రతి ఒక్కరూ ప్రోత్సాహం అందించాలన్నారు. వేడుకలలో భాగంగా బన్ను, వికాస్, లిటిల్ ఫ్లవర్ స్కూల్, స్పందన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమం ముగింపు సందర్భంగా వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన దివ్యాంగులకు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంస పత్రాలతో పాటు మెడల్స్ బహూకరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీవో మేన శ్రీను, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ ఇసంపెల్లి జోనా, డిఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య, కేయూ పాలకమండలి సభ్యులు డాక్టర్ కె.అనితా రెడ్డి, విద్యా ఫౌండేషన్ ఛైర్మన్ బిల్ల మహేందర్, దివ్యాంగ సంఘం ప్రతినిధులు రాజు, శ్రీనివాస్, సిడిపివో విశ్వజ, ఎఫ్ఆర్వో రవి కృష్ణ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఇన్చార్జి అధికారి ఎస్ ప్రవీణ్ కుమార్, చైల్డ్ హెల్ప్ లైన్ కో ఆర్డినేటర్ భాస్కర్, పోషణ అభియాన్ కో ఆర్డినేటర్ సుమలత, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల శిక్షణా కేంద్రాలను పరిశీలించిన పరిశీలకులు వి. సర్వేశ్వర్ రెడ్డి



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, డిసెంబర్ 03 (తీన్మార్ న్యూస్): గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికల పర్యవేక్షణకు నియమితులైన పరిశీలకులు వి. సర్వేశ్వర్ రెడ్డి బుధవారం జిల్లాలోని పలు మండలాలను సందర్శించి ఎన్నికల ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించారు. ఎన్నికల నిర్వహణలో ఏ చిన్న లోపం చోటుచేసుకోకుండా అధికారులు అత్యంత బాధ్యతతో వ్యవహరించాలని ఆయన సూచనలు జారీ చేశారు. ముందుగా ఆయన ఆర్వోలు ఏ ఆర్ ఓ ల శిక్షణ కేంద్రాలను సందర్శించారు. పరిశీలనలో భాగంగా పాల్వంచ మండలంలోని అనుబోస్ కాలేజీలో నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని తనిఖీ చేసి, శిక్షకులు ఇస్తున్న మార్గదర్శకాలు, శిక్షణ పాఠ్యాంశాలు, హాజరు రికార్డులు వంటి అంశాలను వివరంగా పరిశీలించారు. అనంతరం బర్గంపహాడ్ మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల , భద్రాచలం మండలంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రాలను సందర్శించి సిబ్బందికి అందజేస్తున్న నామినేషన్ ప్రక్రియ, కోడ్ ఆఫ్ కండక్ట్, ఎన్నికల రోజున చేపట్టాల్సిన వివిధ విధులపై శిక్షణ నాణ్యతను సమీక్షించారు. శిక్షణా కేంద్రాల్లో మౌలిక వసతులు, సమృద్ధిగా ఉండటం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పరిశీలకులు మాట్లాడుతూ, “గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైనవి. ప్రతి ఆర్వో , ఏ ఆర్ ఓ లు ఎన్నికల సిబ్బంది చట్టబద్ధంగా తమకు కేటాయించిన విధులను అత్యంత జాగ్రత్తగా నిర్వర్తించాలి అని అన్నారు. శిక్షణా దశలోనే అన్ని విధానాలు పూర్తిగా అవగాహన చేసుకుని తర్వాత క్షేత్రస్థాయిలో పనులు చేపట్టాలి. చిన్న తప్పిదం కూడా ఎన్నికల ప్రక్రియకు అంతరాయం కలిగించే అవకాశం ఉన్నందున ప్రతి చర్యలో జాగ్రత్త వహించాలి” అని ఆయన తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని సూచనలు, మార్గదర్శకాలు ఖచ్చితంగా పాటించాలని ఆయన అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. తదుపరి నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన పరిశీలకులు లక్ష్మీదేవిపల్లి మండలంలోని జీపీ లక్ష్మీదేవిపల్లి, జీపీ శ్రీనగర్ కాలనీ అలాగే సుజాత్‌నగర్ మండలంలోని జీపీ సీతంపేట బంజారా, జీపీ సర్వారం కేంద్రాలను సందర్శించారు. నామినేషన్ స్వీకరణ, రికార్డు నిర్వహణ, భద్రత, సిబ్బంది హాజరు, క్యూలైన్ వ్యవస్థ మొదలైన అంశాలను పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా కార్యాచరణ కొనసాగించాలని ఆదేశించారు. ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా ప్రశాంత వాతావరణం కల్పించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉందని పరిశీలకులు తెలిపారు. ఈ పర్యనల్ లో సంబంధిత శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**డాక్టర్ రామ్మూర్తి యాదవ్**

సూర్యాపేట, డిసెంబర్ 03 (తీన్మార్ న్యూస్): జిల్లా కేంద్రంలోని వినూత్న హాస్పిటల్ లో ఈనెల 7వ తేదీన నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఐఎంఏ (ఇండియన్ మెడికల్ అసోసియేషన్) ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ వూర రామ్మూర్తి యాదవ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గాయత్రి నర్సింగ్ హోమ్ ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. ఎంతో ఖరీదైన న్యూరో, గ్యాస్ట్రో వైద్య పరీక్షలను ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 7వ తేదీన జిల్లా కేంద్రంలోని వినూత్న హాస్పిటల్ లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ వైద్య శిబిరం ఉ ంటుందన్నారు. గత 30 సంవత్సరాలుగా ఐఎంఏ, ఐఎంఏ ట్రస్ట్ ఆధ్వర్యంలో 300కు పైగా సేవా కార్యక్రమాలు చేయడం జరిగిందని, మరో అడుగు ముందుకేస్తూ ఎంతో ఖరీదైన పరీక్షలను సైతం ప్రజలకు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. మొదటిసారిగా ఉ దరకోశ మరియు నరాలకు సంబంధించిన సూపర్ స్పెషాలిటీ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. వీటితోపాటు కడుపునొప్పి కామెర్లు ఫ్యాటీ లివర్ సిర్రోసిస్ ఆఫ్ లివర్ మలబద్ధకం రక్త వాంతులు రక్త విరోచనాలు మరియు తలనొప్పి ఫిట్స్ నరాల బలహీనత తల తిరగడం సంబంధించిన జబ్బులను ఉచితంగా చూడడం జరుగుతుందన్నారు.

**చేసే పరీక్షలు**

1). యు జి ఐ ఎండోస్కోపీ( నోట్లో గొట్టం వేసి చేసే పరీక్ష... ఖర్చు 2000.. ఉచితంగా చేయబడును.

2). కొలనోస్కోపి ( పెద్ద పేగు చూసే గొట్టం... విలువ 5000 ఉచితంగా చేయబడును.

3). ఫైబ్రో స్కాన్ ( లివర్ పనితనం... పరీక్ష విలువ 7000....ఉచితంగా చేయబడును.

ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. 5వ తేదీ, 6వ ఆరో తేదీన ముందుగా పేరు నమోదు చేసుకోవాలనీ సంప్రదించవలసిన ఫోన్ నెంబర్.... 9849835276 గా తెలిపారు.

# మండలంలో సర్పంచ్‌గా ఏకగ్రీవం

**సన్మానించిన మంత్రి సీతక్క**



తాడ్వాయి, డిసెంబర్ 03 (తీన్మార్ న్యూస్): తాడ్వాయి మండలం పంబాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలపరచిన సర్పంచ్ అభ్యర్థులు మూతి శ్రీను మరియు అంకంపెల్లి గ్రామంలో ఇర్ప వెంకటేశ్వర్లు, నర్సాపూర్ గ్రామంలో యాప మోహన్ రావు సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నికయిన సందర్భంగా మంత్రి సీతక్క శాలువ కప్పి సన్మానించి వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బిఆర్ఎస్ పార్టీ నేతలు మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, మండల పార్టీ అధ్యక్షుడు బొల్లు దేవేందర్, మేడారం ట్రస్ట్ చైర్మన్ అర్రెం లచ్చు పటేల్, మాజీ సర్పంచ్ ఇర్పా సునీల్ దొర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన పుష్ప వస్త్రాలంకరణ కార్యక్రమంలో మంత్రి సీతక్క



గోవిందరావుపేట, డిసెంబర్ 03 (తీన్మార్ న్యూస్): గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు రామగిరి జగదీష్ కూతురికి నూతన వస్త్ర పుష్పాలంకరణ కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి వర్యులు సీతక్క పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, ఎన్ ఐ టి యూ సి జిల్లా అధ్యక్షుడు కొంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ అనిల్ యాదవ్, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఏకగ్రీవంగా ఎన్నికయిన నూతన సర్పంచ్ లకు మంత్రి సీతక్క సన్మానం



ములుగు, డిసెంబర్ 03 (తీన్మార్ న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా గ్రామాభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా ఏకగ్రీవంగా సర్పంచులను ఎన్నుకోవడం సంతోషం అని ఏకగ్రీవంగా ఎన్నికయిన గ్రామపంచాయతీలకు మరింత ప్రాధాన్యత కల్పిస్తామని, మంత్రి సీతక్క అన్నారు. వెంకటాపూర్ మండలం అడవి రంగాపూర్ (నారాయణపూర్) గ్రామంలో ఏకగ్రీవంగా ఎన్నికయిన కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి దొంతరబోయిన లక్ష్మిని, ములుగు మండలం అంకన్నగూడెం గ్రామంలో ఏకగ్రీవంగా ఎన్నికయిన కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి కొట్టెం రాజుకి శుభాకాంక్షలు తెలిపి వారిని మంత్రి సీతక్క సాళువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బైరెడ్డి భగవాన్ రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, ములుగు మండల పార్టీ అధ్యక్షుడు ఎండీ చాంద్ పాషా, వెంకటాపూర్ మండల పార్టీ అధ్యక్షుడు చెన్నోజు, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు మారం సుమన్ రెడ్డి, మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బండి శ్రీను, ములుగు ఎస్సీ సెల్ అధ్యక్షుడు మట్టేవాడ తిరుపతి, నాయకులు అర్రెం సారంగం, కొట్టెం బాలయ్య, అల్లం రామయ్య బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు దొంతరబోయిన కుమారస్వామి, సదానందం, రాము, సంపత్, జంపయ్య ఐలయ్య, అశోక్, గ్రామ కమిటీ వెంకటస్వామి సీనియర్ నాయకులు మండల నాయకులు పాల్గొన్నారు.

# తోడబుట్టిన అన్ననే హత్య చేసిన తమ్ముడు

**బీమా సంస్థ అనుమానంతో బయటపడ్డ ఘోరం**

**ముగ్గురు నిందితుల అరెస్ట్.. సీపీ సజ్జనార్ ఎమోషనల్ పోస్ట్**




హైదరాబాద్, డిసెంబర్ 03 (తీన్మార్ న్యూస్): కరీంనగర్ జిల్లా రామడుగులో రూ. 4 కోట్లకు బీమా చేయించి అన్నను ఘోరంగా హతమార్చాడు. ఈ ఘటనలో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. బీమా సంస్థ ప్రతినిధులకు అనుమానంతో పోలీసులు దర్యాప్తు చేపట్టడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై బుధవారం ఎక్స్ వేదికగా హైదరాబాద్ సీపీ సజ్జనార్ స్పందించారు. డబ్బు మత్తులో బంధాలు చిద్రం అంటూ ఎమోషనల్ పోస్ట్ చేశారు. బీమా డబ్బుల కోసం తోడబుట్టినవాడినే కడతేర్చిన ఈ ఘటన, మన సమాజం ఎటు పోతోందో చెప్పకనే చెబుతోంది. పేగుబంధం కంటే పైసలే ఎక్కువనుకోవడం అత్యంత దురదృష్టకరం. గుర్తుంచుకోండి కష్టమొస్తే నోట్లు కన్నీళ్లు తుడవవు. ఆస్తులు ఆలింగనం చేసుకోవు. సిరి సంపదలు వస్తాయి పోతాయి, కానీ తోడబుట్టిన వాడు, కన్నవారు, కష్టంలో నిలిచే స్నేహితుడు ఇవే నిజమైన ఆస్తులు. అవి మనతోనే ఉంటాయి. ఏ బ్యాంక్ బ్యాలెన్స్ గుండె చప్పుడును కొనలేదు. ఏ బీమా పాలసీ పోయిన ప్రాణాన్ని తిరిగి తేలేదు. దురాశ కోరల్లో చిక్కుకుని మానవత్వాన్ని బలి పెట్టొద్దు. డబ్బు శాశ్వతం కాదు మనిషి, మమకారాలే ముఖ్యం అని సజ్జనార్ ట్వీట్‌లో పేర్కొన్నారు.

# ప్రజల మధ్య విద్వేషాలను నింపొద్దు

**కోనసీమ కొబ్బరికి 'తెలంగాణ దిష్టి వ్యాఖ్యలపై షర్మిల ట్వీట్**

**కొబ్బరి రైతులకు తక్షణ పరిష్కారం చూపండి**

**రూ. 3500 కోట్లు వెంటనే కేటాయించండి**



తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 03 (తీన్మార్ న్యూస్): తెలంగాణపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేసిన కామెంట్స్ దుమారం రేపుతున్నాయి. ఆయన చేసిన వ్యాఖ్యలకు బీఆర్ఎస్, కాంగ్రెస్ కౌంటర్ ఇస్తున్నారు. ఇక తాజాగా ఈ వివాదంపై వైఎస్ షర్మిల సంచలన ట్వీట్ చేశారు. కోనసీమ కొబ్బరికి తెలంగాణ ప్రజల దిష్టి తగిలిందంటూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడటం బాధాకరం అంటూ పోస్ట్ పెట్టారు. ఇలాంటి మాటలు ప్రజల మధ్య వైషమ్యాలను రెచ్చ గొట్టడమే అంటూ నిప్పులు చెరిగారు. ఇది పవన్ బాధ్యతారాహిత్యానికి నిదర్శనం అని మండిపడ్డారు. వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు షర్మిల. అన్నదమ్ముల్లాంటి ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల మధ్య మళ్ళీ ప్రాంతీయ విద్వేషాలను నింపొద్దని కోరారు. సముద్రం నుంచి పైకొస్తున్న ఉప్పు నీళ్లతో లక్షల సంఖ్యలో చెట్లు కూలిపోతే, ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టని ప్రభుత్వ వైఫల్యాన్ని దిష్టి మీద రుద్దడం సరికాదని చురకలు అంటించారు. మూఢ నమ్మకాలను అడ్డంపెట్టుకుని ప్రజలను కించపరచడం ఉప ముఖ్యమంత్రిగా మీకు సబబు కాదని ఆగ్రహించారు. కోనసీమ కొబ్బరిచెట్టుపై కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఉప్పునీటి ముప్పును తప్పించండని కోరారు. కొబ్బరి రైతుల కష్టాలకు తక్షణ పరిష్కారం చూపండని డిమాండ్ చేశారు. రూ.3500 కోట్లు వెంటనే కేటాయించి పనులు మొదలు పెట్టండన్నారు షర్మిల.

# టీ20 ప్రపంచకప్‌కు భారత్ కొత్త జెర్సీ

**బ్లూ-ఆరెంజ్ కాంబినేషన్ ఆవిష్కరణ**

**వచ్చే ఏడాది భారత్, శ్రీలంకలలో పొట్టి ప్రపంచకప్**

న్యూ ఢిల్లీ, డిసెంబర్ 03 (తీన్మార్ న్యూస్): వచ్చే ఏడాది టీ20 వరల్డ్ కప్‌కు భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న విషయం తెలిసిందే. ఈ పొట్టి ప్రపంచకప్‌లో భారత జట్టు ధరించే జెర్సీని బీసీసీఐ బుధవారం ఆవిష్కరించింది. రాయ్‌పూర్‌లో భారత్, సౌతాఫ్రికా మధ్య జరుగుతున్న రెండో వన్డేలో తొలి ఇన్నింగ్స్ విరామ సమయంలో 100 మందికిపైగా విద్యార్థులతో భారత జెర్సీని ఆవిష్కరించారు. అనంతరం స్టార్ క్రికెటర్ రోహిత్ శర్మ, తిలక్ వర్మ జెర్సీతో ఫోజులిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీసీఐ సెక్రెటరీ దేవజిత్ సైకియా, ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా, జాయింట్ సెక్రెటరీ ప్రభ్‌తేజ్ సింగ్ పాల్గొన్నారు. బ్లూ కలర్‌తో ఉన్న జెర్సీపై మధ్యలో కొత్తగా నిలువగా బ్లూ కలర్‌లో చారలు ఉన్నాయి. పక్కలకు ఇరువైపుల చేతుల వరకూ ఆరెంజ్ కలర్ ఉంది. అలాగే, భారత త్రివర్ణ రంగులతో కూడిన కాలర్‌ను డిజైన్ చేశారు. భుజాలపై వైట్ కలర్‌తో ఉన్న గీతలు అలాగే ఉన్నాయి. ఫిబ్రవరి 7 నుంచి టీ20 వరల్డ్ కప్ ప్రారంభంకానుండగా భారత జట్టు డిఫెండింగ్ చాంపియన్‌లో బరిలోకి దిగుతోంది. ఓపెనింగ్ మ్యాచ్‌లో యూఎస్ఏతో తలపడనుంది.

# త్వరలో భూములన్నింటికీ 'భూధార్' నంబర్లు

**సర్వే, రిజిస్ట్రేషన్, రికార్డుల ఏకీకరణ**

**ఎన్ఐసీ పర్యవేక్షణలో కొత్త వెబ్‌సైట్**

**నక్షాలు లేని గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టు**

**మూడు దశల్లో భూధార్ కార్డుల జారీ**



హైదరాబాద్, డిసెంబర్ 03 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో భయంకరమైన ధరణిని బంగాళాఖాతంలో వేస్తామన్నామని, లోపభూయిష్టమైన చట్టాలను సవరిస్తామన్నామని అదే దిశగా భూ భారతిని తీసుకొచ్చామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. దానికి అనుగుణంగానే కొత్త చట్టానికి నిబంధనలను స్పష్టంగా రూపొందించామన్నారు. కష్టమొస్తే, అన్యాయం జరిగిందనుకుంటే కోర్టుకు వెళ్లకుండా భూ భారతి చట్టం ద్వారా ప్రజలకు ఉపయోగకరమైన చట్టాన్ని తీసుకొచ్చామని గుర్తు చేశారు. రెండేండ్ల రెవెన్యూ పాలనపై సచివాలయంలో మంత్రి పొంగులేటి వివరించారు. తన శాఖల్లో తీసుకొచ్చిన సంస్కరణలు, మార్పులను తెలిపారు. వాటి ద్వారా ప్రజలకు ఎంత మేలు కలిగిందన్న అంశాలను మీడియాకు వివరించారు. మెరుగైన రెవెన్యూ వ్యవస్థను దశల వారీగా అమలు చేస్తున్నామన్నారు. భూ భారతి చట్టం తర్వాత వచ్చిన 9 లక్షల అప్లికేషన్లను పరిష్కరించే దిశగా చట్టాన్ని అమలు చేస్తున్నామన్నారు. అలాగే ధరణి ద్వారా వచ్చి 2.45 లక్షల అప్లికేషన్లను పరిష్కరించాం. 10 నెలల్లో 4 నెలల్లో 2 లక్షలు వచ్చాయి. ఈ 6.45 లక్షల అప్లికేషన్లను పరిష్కరించాం. రిజెక్ట్ చేస్తే సరైన స్పీకింగ్ ఆర్డర్ ఇస్తూ సమాధానం ఇస్తున్నామన్నారు. సీసీఎల్ఏ లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతులతో కలిసి నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా అనేక అంశాలను మీడియాకు వివరించారు.

**మూడింటి ఏకీకరణ**

భూ భారతి చట్టం అమలైన తర్వాత వెబ్ సైట్ విదేశీ సంస్థ టెర్రాసిస్ కంపెనీ నుంచి కేంద్ర ప్రభుత్వ ఎన్ఐసీ సంస్థకు అప్పగించామని మంత్రి పొంగులేటి అన్నారు. ఈ క్రమంలోనే ల్యాండ్స్ అండ్ రికార్డుల వ్యవస్థతో పాటు దేశంలో ఉండే వివిధ రాష్ట్రాల్లో ఉండే మాదిరిగా సర్వే, రిజిస్ట్రేషన్ వ్యవస్థలను అనుసంధానం చేస్తున్నామన్నారు. కొత్త సంవత్సరంలో ఇది అమలు చేస్తామన్నారు. ధరణి యాప్ తయారు చేస్తే సీక్రెట్ లాకర్స్ ని ఓపెన్ చేసి అందరూ చూసే విధంగా పారదర్శకతను అమలు చేస్తున్నాం. ఎన్ఐసీ సంస్థ భూ భారతి చట్టాన్ని నడుపుతున్న ఎన్ఐసీకే ఈ కొత్త యాప్ ను తయారు చేసేటట్లుగా చేస్తున్నాం. అన్ని ఆప్షన్లతో ఎన్ఐసీ రూపొందించిన వెబ్ సైట్ ను వచ్చే నెల నుంచి అమలు చేస్తాం. ధరణి, భూ భారతిల మధ్య తేడా అందరికీ తెలుసునన్నారు. సర్వే మ్యాప్ లేకుండా గుంట భూమిని కూడా రికార్డుల్లో నమోదు చేయని వ్యవస్థను రూపొందించే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు.

**త్వరలో భూధార్ నంబర్లు**

దశాబ్దాల నుంచి పది 33 జిల్లాల్లో 413 గ్రామాలకు నక్షాలు లేవు. ఈ గ్రామాలకు పైలెట్ ప్రాజెక్టుగా నాలుగు ప్రాంతాల్లో ఐదు రెవెన్యూ గ్రామాల్లో నక్షాలతో పాటు సర్వే నంబర్లు ఇచ్చామన్నారు. 1948లో 40 లక్షల సర్వే నంబర్లు ఉండేవి. ఇప్పుడు 2.42 కోట్ల సర్వే నంబర్లుగా మారాయి. దీనికి ఫుల్ స్టాప్ పెట్టేందుకే ఐదు గ్రామాల్లో కొత్త సర్వే నంబర్లు ఇవ్వడంతో పాటు భూమికి హద్దులు నిర్ణయించాం. భూ ధార్ నంబర్ కూడా ఇస్తున్నామన్నారు. రెడీ చేశాం. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు. విడతల వారీగా 413 గ్రామాల్లో మొదలు పెడతామన్నారు. 373 గ్రామీణ రెవెన్యూ గ్రామాల్లో ఫేజ్ 2 లో తీసుకోబోతున్నామన్నారు. సర్వే, బౌండరీస్, బై నంబర్లు, భూధార్ కార్డులు కూడా జారీ చేస్తామన్నారు. థర్డ్ ఫేజ్ లో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో చేపడతామన్నారు. మోడల్ ప్రాజెక్టుగా వివాదం లేని, అభద్రత లేని భూమి రికార్డులను రూపొందిస్తామన్నారు. వ్యవస్థను బలోపేతం చేస్తున్నాం. పదే పదే ఆ ప్రభుత్వాన్ని గుర్తు చేయడానికి నాకే సిగ్గనిపిస్తున్నది. కొత్త వ్యవస్థను నెలకొల్పేందుకు కొద్దిగా లేట్ అయినా చేస్తున్నామన్నారు. ఇచ్చిన ప్రతి మాటను అమలు చేస్తామన్నారు. రాష్ట్రంలో 10519 రెవెన్యూ గ్రామాల్లో మొదటి విడత ఆరు వేల మంది జీపీవో వ్యవస్థను రూపొందించామన్నారు. వారితో సర్వే, రికార్డులు, సరిహద్దుల వ్యవస్థను సక్రమంగా చేసేందుకు వీళ్లను ఉపయోగించుకుంటామన్నారు. భూధార్ యాప్ లో బ్యాంక్ అకౌంట్ మాదిరిగానే రికార్డులు ఉంటాయి. ఎన్ఐసీకి ఈ బాధ్యతలను అప్పగించినట్లు చెప్పారు. సర్వే మ్యాప్ కూడా ఫిక్స్ చేస్తున్నట్లు తెలిపారు. కో ఆర్డినేట్స్ కూడా భూధార్ లో పేర్కొంటున్నట్లు వివరించారు. భూధార్ కాన్సెప్ట్ ని పూర్తి సెక్యూరిటీతో చేస్తామన్నారు. డిసెంబరులోనే నక్షాలు లేని 373 గ్రామాల్లో సెకండ్ ఫేజ్ లో భూధార్ కార్డులు జారీ చేస్తామన్నారు.

**లైసెన్సుడ్ సర్వేయర్ల వ్యవస్థ**

లైసెన్సుడ్ సర్వేయర్లను కూడా పారదర్శకంగా అమలు చేస్తున్నామని మంత్రి పొంగులేటి ప్రకటించారు. అప్లై చేసిన 10450 మందిలో క్వాలిఫై అయితే 3,490 మందిని నియామకపు పత్రాలు పంపిణీ చేశామన్నారు. రాష్ట్రంలో ఉండే ఒక్కో మండలానికి నాలుగు నుంచి ఆరుగురు ఉండే వరకు ఎంపిక చేస్తామన్నారు. 7 వేల మంది సెకండ్ ఫేజ్ వారికి 10వ తేదీ తర్వాత పరీక్ష పెడతామన్నారు. వారి నుంచి అర్హులకు కూడా లైసెన్స్ జారీ చేస్తామన్నారు. ఇది కూడా ఈ నెలాఖరు వరకు పూర్తి చేస్తామన్నారు. దాదాపు 2500 మందిని అలాట్ చేస్తామన్నారు. వారికి కావాల్సిన ఎక్విప్మెంట్ ని ఇస్తామన్నారు. టెక్నాలజీ ప్రకారం రోవర్స్ ని 400 కొనుగోలు చేశాం. పది రోజుల్లో వీటిని పంపిణీ చేస్తామన్నారు. సెకండ్ ఫేజ్ లోనూ మరికొన్ని కొనుగోలు చేస్తామన్నారు. సర్వే వ్యవస్థను దశల వారీగా రాష్ట్ర ప్రజలకు మంచి చేసేందుకు వినియోగిస్తామన్నారు. పారదర్శకంగా, క్వాలిటీతో, పద్ధతి ప్రకారం మేలు కలిగించే విధంగా చేస్తాం.

**త్వరలో సాదాబైనామాల రెగ్యులరైజేషన్**

అగ్రికల్చర్ భూములను తహశీల్దార్, నాన్ అగ్రికల్చర్ సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ చేస్తున్నారని మంత్రి గుర్తు చేశారు. వేర్వేరుగా ఉండడం వల్ల ఇబ్బందులు జరుగుతున్నాయి. అందుకే సింగిల్ పేజీకి తీసుకొస్తున్నాం. ఎక్కడా పొరపాటు జరగకుండా ఉండేందుకే సింక్రనైజ్ చేస్తామన్నారు. సాదాబైనామా అప్లికేషన్లు 9.25 లక్షలు ఉన్నాయి. భూ భారతిలో క్లియర్ చేస్తామని హామీ ఇచ్చాం. కోర్టు స్టే వెకెట్ చేయించాం. అప్లికేషన్లకు నోటీసులు జారీ చేశారన్నారు. త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. సొంత పాలేరు నియోజకవర్గం నేలకొండపల్లిలో రెవెన్యూ ల్యాండ్ మైనింగ్ డిపార్టుమెంట్ ద్వారా ప్రభుత్వ భూమిని లీజుకు తీసుకున్నారు. కొందరు పెద్ద మనుషులు సాదాబైనామా ద్వారా కొనుగోలు చేశామంటున్నారు. అలాంటి వాటిని ఎలా చేస్తాం? ఫారెస్ట్, దేవాదాయ, వక్ఫ్, ప్రభుత్వ భూములను సాదాబైనామాల ద్వారా అప్లికేషన్లు పెట్టుకుంటే క్లియర్ చేయలేం. న్యాయమైన వాటిని మాత్రమే రెగ్యులరైజ్ చేయగలమన్నారు. ధరణి పెండింగ్ అప్లికేషన్లు, రెవెన్యూ సదస్సుల తర్వాత 9 లక్షల అప్లికేషన్లను జనవరి చివరికల్లా పూర్తి చేస్తామన్నారు. ఇంకా పెండింగులో ఉంటే ట్రిబ్యునల్ సిస్టంను ఏర్పాటు చేస్తామన్నారు.

# భారత్‌కు తప్పని ఓటమి

**దక్షిణాఫ్రికా రికార్డు విజయం**

**1-1తో సిరీస్ సమం**

**కోహ్లీ, రుతురాజ్ శతకాలు వృథా**

**సఫారీలను గెలిపించిన మార్క్రమ్, డెవాల్డ్ బ్రెవిస్**




**రాయ్‌పూర్ :** భారీ స్కోర్లు నమోదైన రెండో వన్డేలో బౌలింగ్ వైఫల్యంతో భారత జట్టుకు ఓటమి తప్పలేదు. ప్రత్యర్థి ఎదుట 359 పరుగుల రికార్డు లక్ష్యాన్ని నిర్దేశించినా బౌలర్లు తేలిపోవడంతో దక్షిణాఫ్రికా 4 వికెట్ల తేడాతో విజయఢంకా మోగించింది. ఛేదనలో నిలకడగా ఆడిన ఆ జట్టు.. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' మార్క్రమ్ (98 బంతుల్లో 110, 10 ఫోర్లు, 4 సిక్సులు), మాథ్యూ బ్రీట్జ్‌కే (64 బంతుల్లో 68, 5 ఫోర్లు), డెవాల్డ్ బ్రెవిస్ (34 బంతుల్లో 54, 1 ఫోర్, 5 సిక్సులు) రాణించడంతో లక్ష్యాన్ని మరో నాలుగు బంతులుండగానే పూర్తిచేసింది. మొదట బ్యాటింగ్ చేసిన భారత్.. నిర్ణీత ఓవర్లలో 5 వికెట్ల నష్టపోయి 358 రన్స్ సాధించింది. విరాట్ కోహ్లీ (93 బంతుల్లో 102, 7 ఫోర్లు, 2 సిక్సులు) వరుసగా రెండో సెంచరీ చేయగా రుతురాజ్ గైక్వాడ్ (83 బంతుల్లో 105, 12 ఫోర్లు, 2 సిక్సులు) తన కెరీర్‌లో తొలి సెంచరీని నమోదుచేశాడు. కెప్టెన్ రాహుల్ (66లి) మరో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. సిరీస్ విజేతను నిర్ణయించే ఆఖరి వన్డే ఈనెల 6న వైజాగ్‌లో జరుగుతుంది.

**ఎక్కడా తగ్గలే..**

రికార్డు ఛేదనలో దక్షిణాఫ్రికా ఎక్కడా వెనుకడుగు వేయలేదు. 25 పరుగుల వద్దే ఆ జట్టు డికాక్ (8) రూపంలో తొలి వికెట్‌ను కోల్పోయినా ఆ తర్వాత నిలకడగా ఆడింది. బవుమా (46), మార్క్రమ్ జోడీ రెండో వికెట్‌కు సెంచరీ (101) భాగస్వామ్యం నెలకొల్పి దక్షిణాఫ్రికాను పోటీలోకి తెచ్చింది. ఆది నుంచే భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగిన మార్క్రమ్‌కు బవుమా చక్కని సహకారం అందించడంతో సఫారీల రన్‌రేట్ 6కు తగ్గకుండా సాగింది. కుల్‌దీప్ బౌలింగ్‌లో సింగిల్‌తో అర్ధ సెంచరీ పూర్తిచేసిన మార్క్రమ్.. అతడే వేసిన 18వ ఓవర్లో ఇచ్చిన క్యాచ్‌ను లాంగాన్ వద్ద జైస్వాల్ జారవిడవడంతో బతికిపోయాడు. ఇదే భారత కొంపముంచింది. జడేజా బౌలింగ్‌లో సిక్స్‌తో 90లలోకి వచ్చిన అతడు.. ఫోర్, సింగిల్‌తో వన్డేల్లో తన నాలుగో శతకాన్ని నమోదు చేశాడు. సెంచరీ తర్వాత అతడు రాణా బౌలింగ్‌లో గైక్వాడ్‌కు క్యాచ్‌ఇచ్చినా మార్క్రమ్ స్థానంలో వచ్చిన బ్రెవిస్ దూకుడుగా ఆడాడు. బ్రెవిస్, బ్రీట్జ్‌కే కలిసి నాలుగో వికెట్‌కు 63 బంతుల్లోనే 92 రన్స్ జోడించడంతో దక్షిణాఫ్రికా గెలుపు దాదాపు ఖాయమైంది. కుల్‌దీప్ 41వ ఓవర్లో బ్రెవిస్, ప్రసిద్ధ్ 44వ ఓవర్లో బ్రీట్జ్‌కే, 45వ ఓవర్లో యాన్సెన్ (2) ఔట్ అయినా కార్బిన్ బాష్ (29లి) ఆ గెలుపు లాంఛనాన్ని పూర్తిచేశాడు.

**సంక్షిప్త స్కోర్లు**

భారత్: 50 ఓవర్లలో 358/5 (రుతురాజ్ 105, కోహ్లీ 102, యాన్సెన్ 2/63, బర్గర్ 1/43)బీ

దక్షిణాఫ్రికా: 49.2 ఓవర్లలో 362/6 (మార్క్రమ్ 110, బ్రీట్జ్‌కే 68, అర్ష్‌దీప్ 2/54, ప్రసిద్ధ్ 2/85)

**రుతురాజ్, కోహ్లీ శతక జోరు**

ఓపెనర్లు జైస్వాల్(22), రోహిత్‌శర్మ(14) మరోమారు విఫలం కావడంతో 62 పరుగులకే టీమ్‌ఇండియా ఓపెనర్ల వికెట్లు కోల్పోయింది. ఈ తరుణంలో సూపర్ ఫామ్‌మీదున్న విరాట్ కోహ్లీ(93 బంతుల్లో 102, 7ఫోర్లు, 2సిక్సులు), రుతురాజ్ గైక్వాడ్(83 బంతుల్లో 105, 12ఫోర్లు, 2సిక్సులు) సెంచరీలతో కదం తొక్కారు. వన్డేల్లో తన స్థానంపై వస్తున్న విమర్శలకు కోహ్లీ మరోమారు అద్భుత శతకంతో సమాధానం చెప్పాడు. మరో ఎండ్‌లో రుతురాజ్ వచ్చిన అవకాశాన్ని చక్కగా సద్వినియోగం చేసుకున్నాడు.

దేశవాళీ ఫామ్‌ను కొనసాగిస్తూ వన్డేల్లో రుతురాజ్ తొలి సెంచరీని ఖాతాలో వేసుకున్నాడు. వన్డేల్లో తనకు తిరుగులేదని చాటిచెబుతూ కోహ్లీ 53వ సెంచరీతో కోహ్లీ కొత్త చరిత్ర లిఖించాడు. వీరిద్దరి బ్యాటింగ్‌తో జోరు మీద కనిపించిన ఇన్నింగ్స్ రుతురాజ్ నిష్క్రమణతో కుదుపునకు లోనైంది. యాన్సెన్ బౌలింగ్‌లో రుతురాజ్ ఔట్ కావడంతో మూడో వికెట్‌కు 195 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఆఖర్లో కెప్టెన్ రాహుల్(43 బంతుల్లో 66 నాటౌట్, 6ఫోర్లు, 2సిక్సులు) ధనాధన్ ఇన్నింగ్స్‌తో టీమ్‌ఇండియా 350కి పైగా మార్క్ అందుకుంది.

## ప్రియాంక చోప్రాకు కల్కిలో ఆఫర్?



ప్రపంచవ్యాప్తంగా స్టార్‌డమ్ సంపాదించిన గ్లోబల్ ఐకాన్ ప్రియాంక చోప్రాకు తెలుగు ప్రేక్షకులలోను ప్రత్యేక గుర్తింపు ఉంది. మోడల్‌గా కెరీర్ ప్రారంభించి, ఆ తర్వాత బాలీవుడ్ నుంచి హాలీవుడ్ వరకు తనదైన ముద్ర వేసుకున్న ఆమె మహేష్ బాబు- ఎస్.ఎస్.రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ చిత్రం వారణాసిలో మందాకిని అనే కీలక పాత్రలో కనిపించనున్నారు. మహేష్ బాబు కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాకు కీరవాణి సంగీతం అందిస్తున్నారు. ఈవెంట్‌లో ప్రియాంక తన లుక్‌తో ఆకట్టుకుంది. అయితే ఒకవైపు వారణాసి చిత్రం చేస్తున్న ప్రియాంక చోప్రా ఇప్పుడు మరో తెలుగు సినిమాకి సైన్ చేసిందని అంటున్నారు. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కనున్న కల్కి 2 కోసం ఆమెని సంప్రదించగా దానికి ప్రియాంక గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని అంటున్నారు. కల్కి తొలి పార్ట్‌లో నటించిన దీపికా పదుకొణెళి పలు కారణాల వలన తప్పుకోవడంతో ఆ స్థానంలో ప్రియాంకని తీసుకుంటున్నట్టు టాక్.సీక్వెల్‌లో కమల్ హాసన్ విలన్‌గా కనిపించి తన నటనతో ప్రేక్షకుల మైండ్ బ్లాక్ చేయనున్నాడు. సినిమాపై అంచనాలు భారీగానే ఉన్నాయి. మరి ప్రియాంక ఇందులో నటించనుందని వస్తున్న వార్తలలో నిజం ఎంత ఉందనేది తెలియాల్సి ఉంది. 2000లో మిస్ వరల్డ్‌గా కిరీటాన్ని గెలుచుకున్న ప్రియాంక, తర్వాత హిందీ చిత్రాల్లో వరుస విజయాలు సాధించారు. ఫ్యాషన్ చిత్రంతో జాతీయ ఉత్తమ నటి అవార్డును గెలుచుకుని దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందారు. ఆ తర్వాత హాలీవుడ్‌లో క్వాంటికో, బేవాచ్, సిటాడెల్ వంటి ప్రాజెక్టులతో అంతర్జాతీయ స్థాయిలో స్టార్‌డమ్ సంపాదించారు. రామ్ చరణ్‌తో కలిసి ఆమె నటించిన జంజీర్ రీమేక్‌తో టాలీవుడ్ ప్రేక్షకులకు సుపరిచితురాలయ్యారు. ఆ చిత్రం తెలుగులో తుఫాన్‌గా విడుదలైంది.

# వర్కింగ్ అవర్స్‌తో సినిమా నడవదు

### ఔట్‌పుట్ రావాలంటే..సమిష్టిగా పనిచేయాల్సిందే... తాజాగా నటులు రానా, దుల్కర్ సల్మాన్ వ్యాఖ్యలు



బాలీవుడ్ స్టార్ నటి దీపికా పదుకొణెళి ఇటీవల వర్కింగ్ అవర్స్‌పై చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చకు దారి తీశాయి. రోజుకు ఎనిమిది గంటల పని చాలు..అతిగా వర్క్ చేయడం ఆరోగ్యానికి మంచిది కాదు అని ఆమె చెప్పిన మాటలు హాట్ టాపిక్ అయ్యాయి. ఈ వ్యాఖ్యల కారణంగా ఆమెను 'స్పిరిట్', 'కల్కి 2' ప్రాజెక్టుల నుంచి తప్పించేశారని వచ్చిన వార్తలు మరింత వివాదాన్ని రేకెత్తించాయి. జీవితం-పని మధ్య బ్యాలెన్స్ చాలా అవసరం అని దీపిక చెప్పిన మాటలకి పలువురు సెలబ్రిటీలు ఆమెకు మద్దతు తెలిపారు. మనసు, శరీరం ఒత్తిడిలో ఉన్నప్పుడు మంచి అవుట్‌పుట్ సాధ్యం కాదని కూడా ఆమె స్పష్టం చేశారు. అయితే ఈ వివాదంపై నటుడు దగ్గుబాటి రానా తాజాగా స్పందించారు. సినిమా ఇండస్ట్రీ సాధారణ ఉద్యోగం కాదు. నటన ఒక లైఫ్‌స్టైల్. ఎనిమిది గంటలు కూర్చొని అద్భుతమైన అవుట్‌పుట్ ఇచ్చే ఫీల్డ్ ఇది కాదని రానా వెల్లడించారు. ఒక మంచి సీన్ రావాలంటే కెమెరా నుంచి లైటింగ్ వరకు, నటీనటులు నుంచి టెక్నీషియన్ల వరకూ అందరూ సమయం పట్టించుకోకుండా అంకితభావంతో పని చేస్తారని ఆయన అన్నారు. ఇక్కడ 8 గంటల రూల్ ప్రాక్టికల్‌గా చాలా కష్టం అని స్పష్టం చేశారు. నటుడు దుల్కర్ సల్మాన్ కూడా ఈ విషయంపై తన అభిప్రాయం వ్యక్తం చేశారు. వివిధ పరిశ్రమలలో వర్క్ మోడల్ ఒక్కో రకంగా ఉంటుంది. తెలుగులో మహానటి చేస్తున్నప్పుడు కొన్నిసార్లు సాయంత్రం ఆరు గంటలకే షూటింగ్ అయిపోయేది. తమిళంలో పరిస్థితి కొంచెం వేరుగా ఉంటుంది. ఆదివారాలు కూడా సెలవు ఇస్తారు. ఒక రోజు అతిగా పనిచేయడం కంటే, రోజూ కొంచెం అదనంగా పనిచేయడం బెస్ట్ అని దుల్కర్ స్పష్టం చేశారు. ఇండస్ట్రీ ధోరణి, ప్రాజెక్ట్ డిమాండ్స్ మీద వర్కింగ్ అవర్స్ ఆధారపడి ఉంటాయి అని ఆయన స్పష్టం చేశారు. మలయాళంలో షూటింగ్ ప్రారంభించిన తర్వాత ఎప్పుడు పూర్తి చేస్తారో కూడా తెలియదు.. ఇక తమిళంలో ఈ పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంటుంది. ఒక రోజు అదనపు షూటింగ్ కంటే.. రోజూ కొన్ని గంటలు అదనంగా పనిచేయడం సులువే కదా' అని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దీపికా పదుకొణెళి వ్యాఖ్యలపై రానా,దుల్కర్ స్పందించడంతో సినీ పరిశ్రమలో వర్కింగ్ అవర్స్‌పై చర్చ మళ్లీ హాట్ టాపిక్‌గా మారింది.

## సమంతకు నిడుమోరు గృహంలోకి ఆహ్వానం

### ఎమోషనల్ పోస్ట్ పంచుకున్న రాజ్ సోదరి శీతల్



అగ్ర కథానాయిక సమంత, దర్శకుడు రాజ్ నిడిమోరు జంటకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఇక డిసెంబర్ 2న సమంతకు అత్త వారింట్లో గ్రాండ్ వెల్‌కమ్ లభించింది. ఈ మేరకు రాజ్ సోదరి శీతల్ ఈ జంటకు విషెస్ చెబుతూ ఒక ఎమోషనల్ నోట్ పంచుకున్నారు. నిడిమోరు ఫ్యామిలీలోకి సమంతను ఆహ్వానిస్తూ ఎప్పుడూ ఆమెకు అండగా ఉంటానని అన్నారు. ప్రస్తుతం ఈ ఫ్యామిలీ ఫొటోను అభిమానులు షేర్ చేస్తున్నారు. ఆనందంతో మాటలు రావడం లేదు. గొప్ప భక్తుడు ఆర్తితో నిండిన హృదయంతో శివలింగాన్ని ఆలింగనం చేసుకుంటే ఎంత ఆనందంగా ఉంటాడో ఈరోజు నేను అలా ఉన్నాను. ఆనందబాష్పాలతో నా హృదయం ఉప్పొంగుతోంది. నేడు మా కుటుంబం పరిపూర్ణమైంది. సమంత-రాజ్ ఒకరినొకరు అర్థం చేసుకుంటూ ముందుకుసాగుతుండడం చూసి మాకెంతో గర్వంగా ఉంది. ఒకరిపై ఒకరికి గౌరవం, నిజాయతీతో రెండు హృదయాలు ఒకే మార్గాన్ని ఎంచుకున్నప్పుడు వారి జీవితం ప్రశాంతతో నిండిపోతుంది. మేము వీరికి ఎప్పుడూ అండగా ఉంటాము' అని రాసుకొచ్చారు. ఈషా ఫౌండేషన్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు.



## ఐఎండీబీ పాపులర్ నటులు, దర్శకుల జాబితా

### సైయారా నటులు, దర్శకుడికి తొలిస్థానం

### తెలుగు నుంచి చోటు దక్కించుకోని తెలుగు స్టార్స్



సినిమాలకు సంబంధించి రేటింగ్ పరంగా అత్యంత విశ్వసనీయత కలిగిన ఆన్‌లైన్ వేదికగా పేరున్న ఇంటర్నెట్ మూవీ డేటా బేస్ ఐఎండీబీ ప్రతి ఏడాది సినిమాలతో పాటు తారలకు సంబంధించి వివిధ కేటగిరీలలో ప్రేక్షకాదరణ పొందిన జాబితాను ప్రకటిస్తున్నది. తాజాగా ఈ ఏడాది పాపులర్‌గా నిలిచిన తారల జాబితాను విడుదల చేసింది. ఇందులో తెలుగు నుంచి ఒక్కరు కూడా చోటు దక్కించుకోకపోవడం విశేషం. సైయారా సినిమాతో సూపర్ హిట్ అందుకున్న బాలీవుడ్ యువ నటులు ఆహన్ పాండే, అనిత్ పడ్డా.. వరుసగా మొదటి రెండు స్థానాలను కైవసం చేసుకున్నారు. మోహిత్ సూరి దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం సూపర్ హిట్‌ను అందుకుంది. ఇక కూలీ కామియోతో మెరిసిన ఆమిర్ ఖాన్ ఈ ఏడాది మోస్ట్ పాపులర్ తారల జాబితాలో మూడవ స్థానంలో నిలిచాడు. హోమ్ బౌండ్ సినిమాతో మెప్పించిన ఇషాన్ ఖట్టర్ నాలుగవ స్థానంలో నిలువగా.. బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్ సినిమాతో అలరించిన నటుడు లక్ష్య ఐదవ స్థానంలో దక్కించుకున్నాడు. రష్మిక మందన్నా ఆరో స్థానంలో నిలువగా.. లోక చిత్రంతో సూపర్ హిట్ అందుకున్న కళ్యాణి ప్రియదర్శన్ ఏడో స్థానం దక్కించుకుంది. ధడక్ సినిమాలో నటనకు గాను తృప్తి డిమ్రి ఎనిమిదో స్థానంలో నిలువగా.. రుక్మిణి వసంత్ 9వ స్థానం, రిషబ్ శెట్టి 10వ స్థానం దక్కించుకున్నారుదర్శకుల జాబితాలో ఐఎండీబీ విడుదల చేసిన డేటా ప్రకారం ఈ ఏడాది మోస్ట్ పాపులర్ దర్శకులు ఎవరు అనేది చూసుకుంటే. సైయారాతో సూపర్ హిట్ అందుకున్న దర్శకుడు మోహిత్ సూరి ఈ ఏడాది మోస్ట్ పాపులర్ దర్శకులలో అగ్ర స్థానంలో నిలిచాడు. బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్‌తో ఎంట్రీ ఇచ్చిన షారుఖ్ ఖాన్ తనయుడు ఆర్యన్ ఖాన్ ఈ ఏడాది రెండో స్థానంలో నిలిచాడు. కూలీ సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న లోకేష్ కనకరాజ్ మూడో స్థానంలో నిలువగా.. నిశాంఛీతో హిట్ అందుకున్న అనురాగ్ కశ్యప్ నాలుగో స్థానంలో, ఎల్ 2 ఎంపురాన్ సినిమాతో హిట్ అందుకున్న పృథ్వీరాజ్ సుకుమారన్ ఐదో స్థానంలో నిలిచారు. ఆమిర్ ఖాన్‌తో సితారే జమీన్ పర్ లాంటి సూపర్ హిట్ అందుకున్న దర్శకుడు ఆర్.ఎస్. ప్రసన్న ఆరో స్థానంలో నిలువగా.. మెట్రో ఇన్ డినోతో అనురాగ్ బసు ఏడో స్థానంలో నిలిచాడు. మలయాళం కొత్త లోక సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న దర్శకుడు డొమినిక్ అరుణ్ ఎనిమిదో స్థానంలో చోటు దక్కించు కోగా.. ఛావా దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ 9వ స్థానం, హోమ్ బౌండ్ చిత్రంతో నీరజ్ ఘైవాన్ 10వ స్థానంలో చోటు దక్కించుకున్నాడు.

## ఐటమ్ సాంగ్‌లతో పూజ అదుర్స్

### అల్లు అర్జున్-అట్లీ సినిమాలో ఛాన్స్ వచ్చినట్లు ప్రచారం

తెలుగు సినీ పరిశ్రమలో ఒకప్పుడు టాప్ హీరోలందరి సరసన వరుసగా నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న పూజా హెగ్డే, గత కొన్నేళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటుంది. ఆమె నటించిన కొన్ని పెద్ద సినిమాలు ఆశించిన స్థాయిలో ఆడకపోయినా స్టార్ ఇమేజ్ ఏమాత్రం తగ్గలేదు. గ్లామర్, డాన్స్, స్క్రీన్ ప్రెజెన్స్ లాంటి అంశాల్లో పూజాతో సరితూగే వారు లేరని చెప్పాలి. అల్లు అర్జున్, మహేశ్ బాబు, జూనియర్ ఎన్టీఆర్, ప్రభాస్, రామ్ చరణ్ వంటి అగ్రనటులతో నటించటం ఆమె కెరీర్‌కే ప్రత్యేక గుర్తింపునిచ్చింది వరుస ఫ్లాప్‌ల వల్ల లీడ్ రోల్స్ తగ్గినా, పూజా మాత్రం వెనక్కి తగ్గలేదు. హీరోయిన్‌గా కాకపోయినా, స్పెషల్ సాంగ్స్, స్పెషల్ రోల్స్ చేసుకుంటూ తన స్టార్ ప్రెజెన్స్‌ను కొనసాగించాలని నిర్ణయించుకుంది. 'కూలీ' సినిమాలో 'మౌనిక' సాంగ్ విజయంతో పూజా మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. ఆమె డాన్స్, లుక్స్, గ్లామర్ ఆ పాటను దక్షిణాది వ్యాప్తంగా వైరల్ చేశాయి. ఈ సాంగ్ హిట్ తర్వాత పూజాకు స్పెషల్ సాంగ్ ఆఫర్లు వరుసగా వస్తున్నాయి. ఇండస్ట్రీ టాక్ ప్రకారం, అల్లు అర్జున్, అట్లీ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ ప్రాజెక్ట్‌లోని ప్రత్యేక గీతం కోసం పూజా హెగ్డేను ఫైనల్ చేసినట్లు సమాచారం. ఈ సాంగ్ కోసం ఆమెకు రూ.5 కోట్లు పారితోషికం ఆఫర్ చేసినట్లు టాలీవుడ్ సర్కిల్స్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి.. ఒక ఐటెమ్ సాంగ్‌కి ఇది అరుదైన భారీ రేమ్యునరేషన్. ఇది పూజా మార్కెట్ ఇంకా బలంగానే ఉందని మరోసారి నిరూపిస్తోంది. సినిమా అవకాశాలు తగ్గినా, సోషల్ మీడియాలో మాత్రం పూజా హాట్ ఫేవరెట్. 2010లో మిస్ ఇండియా పోటీలో రెండోస్థానం సాధించి గ్లామర్ రంగంలోకి అడుగుపెట్టిన పూజా హెగ్డే 2012లో తమిళం 'ముగమూడి' ద్వారా సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చింది. 2014లో వరుణ్ తేజ్ సరసన 'ముకుంద' తో టాలీవుడ్‌కి పరిచయం కాగా, ఆ తర్వాత 'ఒక లైలా కోసం', బాలీవుడ్‌లో 'మోహెంజో దారో' వంటి సినిమాలతో ప్రయాణం కొనసాగించింది. ప్రస్తుతం ఆమె ప్రధాన పాత్రలకంటే స్పెషల్ సాంగ్‌లపైనే దృష్టి పెడుతుంది. స్పెషల్ సాంగ్‌లతో తన మార్కెట్‌ను తిరిగి పదిలం చేసుకుంటున్న పూజా, త్వరలోనే మళ్లీ స్టార్ హీరోల సరసన హీరోయిన్‌గా కనిపించే అవకాశాలు బలంగా ఉన్నాయని టాక్.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463